₹ 10/-

జన రాజకీయం కోసం...


# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 05

మార్చి 1-15, 2018




## కొత్త చట్టం : సాధికారతా? ఇల్లు పీకి పందిరేసుడా?







## జేఎఫ్‌సీ కార్యాచరణ షురూ!




# ఉద్యోగుల్లో ఉన్న ఐక్యత... పన్నులు కట్టే ప్రజల్లో రావాలి!

ప్రతిరోజూ మనం వివిధ రూపాల్లో ప్రభుత్వానికి కడుతున్న పన్నుల డబ్బును సద్వినియోగం చేసే పాలనను ఏర్పాటు చేసుకోవటమే మన జీవితాల్ని బాగుచేసుకోవటానికి ఏకైక మార్గమని 'ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్' ప్రతినిధులు అన్నారు. ఓటు ఐదేళ్లకోసారి వేస్తున్నా పన్నుల్ని మాత్రం మనం రోజు కడుతున్నామని గుర్తుచేశారు. ప్రభుత్వోద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ఎంత సంఘటితంగా వ్యవహరిస్తారో... అలాగే ప్రజలు కూడా తాము కట్టే పన్నులకు తగ్గ సేవలను పొందటానికి ఐకమత్యంతో వ్యవహరించాలన్నారు. ఇలా ప్రజల సమష్టి కార్యాచరణ కోసమే ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్‌ను ప్రారంభించామన్నారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని అబ్దుల్ కలాం పార్కులో ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఓటును ఆలోచించి సరైనవారికి వేయటంతోపాటు, రోజువారీ పాలనపై కూడా ఎవరి పరిధిలోవారు దృష్టి పెడుతూ పన్నుల డబ్బును సద్వినియోగం చేసుకోవటంపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్‌లో చేరి సేవలు పొందేందుకు సేవలందించేందుకు అసోసియేషన్ అధ్యక్షుడు వి. సత్యనారాయణ 99124 15128, ప్రధాన కార్యదర్శి ఎ. కుమార్‌రెడ్డి 94404 99778లను సంప్రదించాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎం. కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి సీహెచ్ వేణు, కోశాధికారి రామవెంకట సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

మార్చి 1-15, 2018 సంపుటి - ౨ సంచిక - 05


## లోపలి పేజీల్లో...


జేఎఫ్‌సీ కార్యాచరణ షురూ ! ..................... 5

తెలుగు భవిత ....................................... 7

విభజన హామీలు అమలయ్యేలా కేంద్రం మీద.... 8

రెవెన్యూ లోటును పూడ్చటం కూడా ............. 11

రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ...... 12

సేవలు లేకుండా పన్నులు చట్టబద్ధ దోపిడీయే.... 17

ప్రజల పన్నుల డబ్బుకు 'పౌరసేవల్ని' ఎప్పుడు...... 18

ఓటు ఒక్కరోజే - పన్నులు ప్రతిరోజూ............. 24

ఇందిర అవివేకపు చర్యలను మోదీ ఎందుకు.... 26

నేర నేతలపై విచారణకు ప్రత్యేక కోర్టులు......... 29

పంచాయతీ రాజ్ కొత్త చట్టం : సాధికారత?.. 31





## కార్టూన్ కార్నర్


### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి.కుటుంబరావు


### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

తులిప్స్ అపార్ట్‌మెంట్స్

6-3-655, ప్లాట్ నెం. 407

సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక

సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**

**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org

loksattatimeslsp@gmail.com


### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*

*ఏడాది చందా : రు. 200*

*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072


### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# నిజాల్ని గుర్తిద్దాం



విభజన సమస్యలు తెలుగు ప్రజలను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. నూతన ఆంధ్రప్రదేశ్‌ను మరీ ఎక్కువగా! కేంద్రం ఏపీకి ఎన్నో చేసిందని కొందరు ఏకరువు పెడుతున్నారుగానీ.. రాష్ట్రాన్ని విభజన సమస్యలు వెన్నాడుతున్నాయని లోక్‌సభలో చేసిన ప్రసంగంలో సాక్షాత్తూ ప్రధాని మోదీయే అంగీకరించారు. రాష్ట్రాల్ని విభజించటం లేదా కలపటం మౌలికమైన అంశం కాదు. అది ఉపద్రవమూ కాదు, సర్వరోగనివారిణీ కాదు. విడిపోవాలని ఒక ప్రాంత ప్రజలు బలంగా కోరుకుంటున్నప్పుడు, సంబంధితులందరినీ కూర్చోబెట్టి ఒక సమగ్ర సామరస్య పరిష్కారం ద్వారా వారి ఆకాంక్షల్ని నెరవేర్చటం ప్రజాస్వామ్యంలో రాజకీయ వ్యవస్థ చేయాల్సిన పని. అన్ని ప్రాంతాల్లో, అన్ని వేదికల మీదా లోక్‌సత్తా ఇవే మాటల్ని చెప్పింది. ఉమ్మడి రాష్ట్రంలో తమకు న్యాయం జరగటంలేదని తెలంగాణ ప్రాంత ప్రజలు భావిస్తున్నప్పుడు.. సమైక్యాంధ్రప్రదేశ్ ఉండాలని భావించే ప్రాచుర్య పార్టీలు తెలంగాణ ప్రాంత ప్రజల గోసను అర్థం చేసుకుని దిద్దుబాటు చేయలేదు. విభజన సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని ఓట్లు దండుకునే దగా రాజకీయ ఎత్తుగడతో ప్రత్యేక తెలంగాణకు మద్దతును ప్రకటించాయి. ఒకరకంగా సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాయి కూడా. ఈ కుట్ర రాజకీయాన్ని ప్రశ్నించకుండా 2009 వరకు కోస్తా, రాయలసీమ ప్రజలు కూడా ఆ పార్టీలకే ఓట్లు వేశారు. చివరకు ప్రధాన జాతీయ పార్టీలు తమ అధికార విస్తరణకు ప్రజల మధ్య చిచ్చుపెట్టే రాజకీయాన్ని దేశవ్యాప్త విధానంగా అమలు చేయటంతో వైరుధ్యాలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. పరిస్థితి ఇంతవరకూ వచ్చాకైనా రాష్ట్రంలోని నేతలు మేలుకోవాలి గదా?.. అదీ లేదు. తెలంగాణ ప్రజల బలమైన ఆకాంక్షను గౌరవిస్తూ, రాష్ట్ర విభజన వల్ల ఉపద్రవమేమీ రాదనే వాస్తవాన్ని వివరిస్తూ మిగిలిన ఏపీ ప్రజల్ని ఒప్పించే బాధ్యతను తీసుకోలేదు. "రాష్ట్రాలు రెండైనా తెలుగువారందరం ఒకటే, మాలో మేం చర్చించుకుని రోడ్‌మ్యాప్‌ని చెబుతాం, మీరు దాన్ని అమలు చేయండి చాలు" అని హుందాగా, ధీమాగా మాట్లాడే పని చేయలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయమే కీలకం. కానీ ప్రజల పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సమన్వయం చేసి అందరికీ స్థూల ప్రయోజనకరంగా ఉండేలా జనాభిప్రాయాన్ని మలచే పని చేయాల్సిన బాధ్యత నాయకత్వానిది. ఆ పని చేయకుండా పలాయనం చిత్తగించారు. విడిపోతే హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేయాలి? అని చెప్పను కూడా లేదు. ఈవేళ్టి విభజన సమస్యలకు మూలం ప్రాచుర్య పార్టీల దగా రాజకీయంలోనే ఉందని చెప్పటానికే ఈ నేపథ్యాన్ని ప్రస్తావించటం! పిట్టల పోరు పిల్లి తీర్చినట్టు.. తెలుగువారి మధ్య అనైక్యతను ఆసరాగా తీసుకుని కేంద్రంలోని పార్టీలు ఫుట్‌బాల్ ఆడుకున్నాయి. ఆ రోజున హైదరాబాద్ ఆదాయం ఎంత ఉంది?, విడిపోతే ఏపీకి వచ్చే రెవెన్యూ లోటు ఎంత? అనే అంశాలను బైటపెట్టిందీ, నూతన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిరక్షణకు, యువత ఉపాధికి, తెలంగాణ మౌలిక వసతులకు రోడ్‌మ్యాప్ ఇచ్చిందీ లోక్‌సత్తా మాత్రమే! లోక్‌సత్తా చెప్పిన అంకెల్నే, ప్రతిపాదించిన ప్రత్యేక తరగతి హోదా తదితరాల్నే పార్లమెంటులో ప్రధాన పార్టీలు ఆమోదించాయి. అయితే వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక హోదా రాయితీల్ని అందించాలని లోక్‌సత్తా చెబితే.. మొత్తం రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని పార్లమెంటులో చిత్తశుద్ధిలేని ప్రకటన చేశారు. ఆ తర్వాత రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయిగానీ రెండు చోట్లా రాజకీయం తీరు మాత్రం మారలేదు. 2014 ఎన్నికల్లో గెలిచాక కూడా పాత రాజకీయ పంథాలోనే వ్యవహరిస్తూ ప్రజల వాస్తవ ప్రయోజనాల్ని పట్టించుకోలేదు. ఆ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోయినా లోక్‌సత్తా ఏపీ, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం 'తెలుగు భవిత' పేరుతో కార్యక్రమాల్ని, రౌండ్‌టేబుల్ సమావేశాల్ని నిర్వహించింది. ప్రత్యేక హోదా కోసం ఇతర రాష్ట్రాలను ఒప్పించటం కష్టమనుకుంటే.. వెనకబడిన ఉత్తరాంధ్ర, సీమలకు కనీసం పారిశ్రామిక రాయితీల్ని అయినా వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాలని, దీనికోసం మోదీ ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటే చాలని అనేకసార్లు లోక్‌సత్తా కోరింది. పోలవరం నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా రోడ్‌మ్యాప్‌తో సహా కేంద్రాన్ని కోరాలని విజ్ఞప్తి చేసింది. ప్రజల సమస్యల పరిష్కారానికి, అందునా తెలుగువారి సమస్యల్ని పరిష్కరించటానికి ఎప్పుడైనా లోక్‌సత్తా సిద్ధం. సోదరుడు పవన్ కళ్యాణ్ పార్టీ రాజకీయాలకతీతంగా చొరవ చూపటంతో మళ్లీ ప్రయత్నం చేస్తున్నాను. నాలుగేళ్లు గడిచిపోవటంతో విభజన హామీలు చిక్కుముళ్లుగా మారాయి. అయినా చిత్తశుద్ధి, అవగాహన, విశ్వసనీయత ఆయుధాలుగా పోరాటం చేయటం అవసరం. మన ఆర్థిక తప్పిదాలపై కేంద్రాన్ని దబాయించలేంకానీ.. విభజన చట్టంలోని అంశాలు, పార్లమెంటు సాక్షిగా ప్రధాని ఇచ్చిన హామీల నుంచి కేంద్రం తప్పించుకోకుండా ఏరు దాటాక తెప్ప తగలేసే ధోరణితో పాలకులు విశ్వసనీయత కోల్పోవటం ప్రమాదకరమన్న వాస్తవాన్ని యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లవచ్చు. జేఎఫ్‌సీగానో, మరో పేరుతోనో విభజన హామీల లెక్కల్ని హేతుబద్ధంగా తేల్చటంతో పాటు.. రాజ్యాంగబద్ధంగా, జాతీయ దృష్టితో అమలుకు పరిష్కారాల్ని చూపటం ఇప్పుడు మన ముందున్న పని. అలాగే తెలంగాణ విషయంలో కూడా పలు హామీల్ని కేంద్ర ప్రభుత్వం తొక్కిపట్టింది. ఏపీతోపాటు తెలంగాణ గురించి కూడా మనం గళం విప్పాలని నేను అన్నప్పుడు పవన్ వెంటనే అంగీకరించారు. ప్రత్యేక హోదా కోడ్ మాత్రమే. అదే సాయాన్ని ఏపేరుతో ఇచ్చినా మనకు అభ్యంతరం అక్కర్లేదు. దేశవ్యాప్తంగా ఓ 80-100 వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా రాయితీల్లో భాగంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణకు ఇచ్చినా మనం స్వాగతించాలి. విభజన సమస్యలు క్రమంగా ఏదోకస్థాయిలో పరిష్కారమవ్వొచ్చు. కానీ ఈ సమస్యలకు దగా రాజకీయం, దుర్రాజ్య పాలనే మూలమని గుర్తించి వ్యవహరిస్తేనే తెలుగు ప్రజల, పార్టీల, నేతల భవిష్యత్తు భద్రంగా ఉంటుంది.






# జేఎఫ్‌సీ కార్యాచరణ షురూ!

ఆంధ్రప్రదేశ్‌ప్రత్యేక హోదా, తెలుగు రాష్ట్రాల ఇతర విభజన సమస్యలపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చొరవతో ఏర్పాటైన సంయుక్త నిజనిర్ధారణ (జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్) కమిటీ (జేఎఫ్‌సీ) తొలి సమావేశం లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో పలు అంశాలపై చర్చ జరిగింది. రూ.లక్షల కోట్లు ఇచ్చానంటూ కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల మాదిరిగానే తప్ప ప్రత్యేకించి ఇవ్వలేదంటూ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్న నేపథ్యంలో.. ప్రజలకు వాస్తవాల్ని, పరిష్కారాల్ని తెలియచేయడం కోసం జేఎఫ్‌సీ ఏర్పాటైంది. పునర్విభజన చట్టం, రాజ్యసభలో నాటి ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ చేసిన ప్రకటనలు, ఏపీకి ఇచ్చిన హామీలకు సంబంధించి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) నుంచి సేకరించిన సమాచారం, హామీలపై తెదేపా చెబుతున్న అంశాలు, ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కేంద్ర మంత్రిగా ఉండగా ప్రత్యేక హోదాపై చేసిన ప్రకటనలు, అమరావతి శంకుస్థాపన సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు, కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటులో చేసిన ప్రకటనలపై సుదీర్ఘ చర్చ జరిగింది.

తమకు లభించిన సమాచారంపై చర్చించేందుకు ప్రాధాన్యం ప్రకారం 11 అంశాలుగా విభజించామని జేపీ వెల్లడించారు. ఏపీ రెవెన్యూలోటు, వెనుకబడిన ప్రాంతాలు, పోలవరం, పన్నుల రాయితీలు, ఏపీలో కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు, నౌకాశ్రయాల ఏర్పాటు, రైల్వే జోన్, ప్రత్యేక ప్రతిపత్తి లేదా హోదా – ప్యాకేజీ కింద ఇచ్చిన నిధులు, రాజధాని నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయన్నారు. సుదీర్ఘ అనుభవం కలిగిన విశ్రాంత సివిల్ సర్వెంట్లు పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, చంద్రశేఖర్‌లతో సబ్‌కమిటీని ఏర్పాటు చేశామని, సమాచారాన్నంతా ఆ కమిటీకి అందిస్తామని తెలిపారు. కొద్దిరోజుల్లోనే నివేదికను ఇస్తామని, తమ నుంచి అద్భుతాల్ని ఆశించవద్దని స్పష్టం చేశారు. ఆవేశం అనర్థాలకు దారితీస్తుందని, తమను ఆకాశానికెత్తి కింద పడేయవద్దని కోరారు.

ఇప్పటివరకు కేంద్రం ఇచ్చిన నిధుల్ని రాష్ట్రం ఎలా ఖర్చు చేసిందనే రీతిలో మాట్లాడటాన్ని జేపీ తప్పుపట్టారు. అయితే జేపీ వాదనకు ఐవైఆర్ కృష్ణారావు అభ్యంతరం చెప్పారు. నిధుల్ని ఎలా ఖర్చు చేస్తున్నదీ రాష్ట్రం కేంద్రానికి చెప్పాల్సిందేనన్నారు. ఆయన వాదనను జేపీ అంగీకరించలేదు. కేంద్రం–రాష్ట్రం–స్థానిక ప్రభుత్వాల మధ్య స్పష్టమైన అధికారాల విభజన ఉంటేనే ఫెడరలిజం మనుగడ సాగిస్తుందని, కేంద్రానికి గుత్తాధిపత్యం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమని స్పష్టం చేశారు. నిర్దిష్ట పథకాలకిచ్చిన నిధులని సద్వినియోగం చేసి తగిన యు.సి.లని రాష్ట్రం ఇవ్వాల్సి ఉంటుందని, అది మినహా రాష్ట్రం రాజ్యాంగబద్ధంగా చట్టసభలకి, రాజ్యాంగసంస్థలకి జవాబుదారిగా ఉంటుందని జేపీ వివరించారు. అవినీతి జరుగు తోంది అంటే చర్యలు తీసుకోవాల్సిందేనని, కానీ అవినీతో, మరోటో ఉంది కాబట్టి నిధుల్ని విడుదల చేయం అంటే ఫెడరల్ ప్రజాస్వామ్య వ్యవస్థ నడవదన్నారు. ఇలాంటి కారణాలతో నిధులివ్వకూడదు అంటే.. భారత్‌లోని ఏ రాష్ట్రానికీ నిధులు వెళ్లవన్నారు. నేతల అవినీతిని, ప్రభుత్వాల తప్పిదాల్ని తగిన పద్ధతుల్లో ఎదుర్కోవాలే తప్ప.. ప్రభుత్వాలు తప్పు చేస్తున్నాయి కాబట్టి మనం ఎవరూ ఓట్లు వేయకూడదంటే అర్థముండదన్నారు. అంశాలను సందర్భాన్ని బట్టి రాజ్యాంగ స్ఫూర్తికనుగుణంగా వేర్వేరుగా చూడకపోతే చిక్కుముళ్లు పెరుగుతాయిగానీ, పరిష్కారాలు రావన్నారు. మామూలుగా రాష్ట్రాలకు వచ్చే నిధుల్ని విభజన లెక్కల్లో కలపటం తగదన్నారు. విభజన హామీల అమలు, కేంద్రం ఇచ్చిన నిధులపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వం పవన్ కళ్యాణ్ కార్యాలయానికి, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్)కు పంపుతామని హామీ ఇచ్చిందన్నారు (ఈమేరకు 118 పేజీల రిపోర్టును అధికారుల ద్వారా ఏపీ ప్రభుత్వం పంపింది). కేంద్రం నుంచి కూడా అడిగితే బీజేపీ నేతలతో పంపుతామన్నారని తెలిపారు.

ఏపీ శ్రేయస్సు కోసం అందరినీ కలుపుకుని సమష్టిగా పోరాడుతున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు. తెలుగుదేశం,

వైసీపీలకు కూడా ఆహ్వానం పంపామని, అయితే వారు రాలేదని అన్నారు. అంశాలవారీగా సబ్‌కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ సమస్యను జాతీయ అత్యవసర పరిస్థితిగా కేంద్రం పట్టించుకోకుంటే దేశం ముక్కలవుతుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం, అశాంతి పెరిగిపోతున్నాయన్నారు. నాయకుల చిత్తశుద్ధిలోపం వల్ల ఎలాంటి పరిస్థితులు ఏర్పాడతాయోన్న భయం కలుగుతోందన్నారు. ఇచ్చిన హామీల్ని నెరవేర్చని పక్షంలో తమను ద్వితీయ శ్రేణి పౌరుల్లా చూస్తున్నారన్న అభిప్రాయానికి ప్రజలు వస్తారని, ఉత్తర, దక్షిణ భారతంగా దేశాన్ని విడగొట్టాలనే వేర్పాటువాదం వైపు బలమైన దారులు పడతాయని పవన్ హెచ్చరించారు. సమాజం కోసం పనిచేసేవాళ్లు కొందరు బతికున్నారనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకే జేఎఫ్‌సీని ఏర్పాటు చేశామన్నారు. విభజన హామీల అమలుపై సమాచారాన్ని అందించాలని సమాచార హక్కు చట్టం కింద కేంద్ర హోం శాఖకు జేఎఫ్‌సీ దరఖాస్తు చేసింది. షెడ్యూల్ 13లో ఇచ్చిన హామీలు, 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో ప్రధాని ఇచ్చిన హామీల సమాచారాన్నీ అడిగారు.

కేంద్ర హోంశాఖ మాజీ ప్రధాన కార్యదర్శి పద్మనాభయ్య, ఏపీ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు, మాజీ ఐఏఎస్ (మహారాష్ట్ర కేడర్) చంద్రశేఖర్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, ప్రొఫెసర్ నాగేశ్వర్, సీపీఎం ఏపీ కార్యదర్శి మధు, సీనియర్ నేత వై.వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ నేత గఫూర్, కాంగ్రెస్ ప్రతినిధులు గౌతం, గిడుగు రుద్రరాజు, లోక్‌సత్తా ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఆర్థికవేత్త అమీర్‌ఖాన్, న్యాయవాది ప్రమోద్‌రెడ్డి, సామాజికవేత్తలు అరుణ, తారా కృష్ణస్వామి, ఎ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రకులాల మహిళల కన్నా.. దళితుల ఆయుర్దాయం 14.6 ఏళ్లు తక్కువ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న లింగవివక్షకు తోడు కులవివక్ష వల్ల భారత్‌లో దళిత మహిళల సగటు ఆయుర్దాయం తక్కువగా నమోదవుతున్నట్టు ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. భారత్‌లోని అగ్రకుల మహిళల సగటు ఆయుర్దాయం 54.1 ఏళ్లు కాగా, దళిత మహిళల విషయంలో 39.5గా నమోదైంది. నివాసముండే ప్రాంతాలు మురికివాడలు కావడం, పౌష్టికాహార లోపం, అవగాహన కొరవడటం, అనారోగ్య సమస్యలు వంటివి దళిత మహిళల జీవితాల్ని కుంగదీస్తున్నాయి. 2030నాటికల్లా లింగ సమానత్వాన్ని సాధించడం లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టిన రెండున్నరేళ్ల తర్వాత సమితి 89 దేశాలపై సర్వే నిర్వహించి నివేదికను వెలువరించింది. ఈ మొత్తం దేశాల్లో 33 కోట్లమంది మహిళలు, బాలికలు పేదరికంలో మగ్గుతున్నట్టు తెలిపింది.

## లోక్‌సత్తా వాదనను రుజువు చేసిన టీఐ తాజా నివేదిక

అవినీతి నిర్మూలనకు పౌర సేవల చట్టం, రియల్ ఎస్టేట్ రంగంలో స్టాంప్ డ్యూటీని, ఇతరత్రా పన్నుల్ని తగ్గించి భూమి విలువను మార్కెట్ రేటుతో దాదాపు సమానంగా పెంచటం నుంచి ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల వరకు ఆచరణాత్మక సంస్కరణలు తేకుండా పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) వల్ల, ప్రధానమంత్రి, ఆయన మంత్రివర్గం వ్యక్తిగతంగా నిజాయతీగా ఉండటం వల్లా పెద్దగా ఒరిగేదేమీ ఉండదని లోక్‌సత్తా పదే పదే చేస్తున్న వాదన సరైనదని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ తాజా నివేదిక కూడా రుజువు చేస్తోంది. అవినీతి నిరోధంలో భారత్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉందని 2017 సంవత్సరానికి ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇచ్చిన ర్యాంకు స్పష్టం చేస్తోంది. భారత్‌కు 81వ ర్యాంకు లభించింది. 2016తో పోలిస్తే 2 ర్యాంకులు దిగజారింది. సున్న నుంచి వంద వరకు ఉన్న స్కోర్ కార్డులో భారత్‌కు 40 మార్కులే దక్కాయి. 2015లో 38 మార్కులతో భారత్ 76వ ర్యాంకులో ఉంది. పొరుగున ఉన్న భూటాన్ 67 మార్కులతో మనకంటే అవినీతి నిరోధంలో మెరుగైన స్థానంలో (26) ఉంది. ఇవి ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా తేల్చిన ర్యాంకులు. వీటికి ఇతర గణాంకాల ప్రాతిపదిక లేదు. నలభై మార్కులు రాని దేశాలను అత్యంత అవినీతిమయమైన దేశాలుగా పరిగణిస్తున్నారు. అవినీతి వ్యతిరేక ర్యాంకింగ్‌లో అగ్రభాగాన న్యూజిలాండ్, డెన్మార్క్ ఉండగా, సిరియా, దక్షిణ సూడాన్, సోమాలియా అట్టడుగున ఉన్నాయి. మనదేశంలో.. పోలీస్ స్టేషన్లు, దర్యాప్తు సంస్థలు, కోర్టుల్లో లంచాలు 62శాతం ఉండగా, నేతల అవినీతి 78శాతం దాకా ఉన్నట్టు, పేదలకు అందాల్సిన ఆహారధాన్యాల్లో 40శాతం మాత్రమే అందుతున్నట్టు నివేదిక తెలిపింది. నిరుద్యోగం అవినీతిని పెంచుతోందని, ఉద్యోగం కోసం పలువురు లంచాలిస్తున్నారని, గట్టి శిక్షలు లేకపోవడం వల్ల అవినీతి పెరుగుతోందని వివరించింది. ప్రజలు అవినీతిని నిరసిస్తారుగానీ, అవినీతిని నిరోధించే విషయంలో వారి మధ్య ఐక్యత లేదని వెల్లడించింది. సమాచార హక్కు చట్టం వచ్చినా సరిపోవటం లేదని తెలిపింది. చివరకు లోక్‌సత్తా చెప్పిన పరిష్కారాలనే సూచించింది. అవినీతిని నిలువరించే చట్టాలు, వ్యవస్థల ఏర్పాటు, నేర దర్యాప్తు సంస్థలకు స్వతంత్రత, ఎన్నికల సంస్కరణలు, ఉద్యోగుల ఆదాయ చిట్టాలపై నిఘా, పాఠశాల స్థాయి నుంచి వ్యక్తి సమగ్రత మీద దృష్టి తదితరాలను అమలుచేయాలని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ పేర్కొంది. ✦

**(రాష్ట్ర విభజనకు ముందు వాస్తవాలతో కీలక పరిష్కారాలను అందించి సామరస్యతను పెంపొందించేందుకు కృషి చేయటమేకాకుండా.. రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడ్డాక విభజన హామీల అమలుకోసం 2014-15 నుంచి లోక్‌సత్తా కృషి చేస్తోంది. విభజనానంతరం లోక్‌సత్తా చేసిన కృషిని కొంతమేర ఈ సంచికలో ప్రస్తావించటం అవసరమని భావిస్తున్నాం. రాజకీయ పార్టీల తీరు, వివిధ పరిణామాలకు సంబంధించి నిజాలను అర్థం చేసుకోవటానికి ప్రజలకు ఇది ఉపయోగపడుతుంది.**

**మొదటగా.. 'తెలుగు భవిత' పేరుతో లోక్‌సత్తా సంకల్ప దీక్షల్ని ప్రారంభిస్తున్న సందర్భంగా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రజలను, ముఖ్యంగా యువతను ఉద్దేశించి మార్చి 2, 2015న రాసిన బహిరంగ లేఖ)..**

# తెలుగు భవిత

## జేపీ సంకల్ప దీక్ష

**నా ఆత్మీయ తెలుగు ప్రజలారా!**

నేను ప్రారంభించిన లోక్‌సత్తా పార్టీకి నష్టం వచ్చినా సరే తెలుగు ప్రజల మధ్య విద్వేషాలు రాకూడదని, సామరస్యంగా అభివృద్ధితో మనమంతా ఎదగాలని రాష్ట్ర విభజన సమయంలో పరిష్కారం కోసం ఢిల్లీ నుంచి గల్లీ వరకూ పోరాడాను. ప్రాంతాలవారీ చిచ్చు వద్దు, తెలుగువారందరం కలిసి కేంద్రం మీద పోరాడి ఎక్కువ నిధుల్ని సాధించుకుందామని కోరుతూ.. రెండు తెలుగు రాష్ట్రాలలో అభివృద్ధికి, ఉద్యోగాలకు, విద్యావకాశాలకు ఆచరణసాధ్యమైన ప్రతిపాదనలతో జనవరి 18, 2014న అసెంబ్లీలో సవివరంగా పరిష్కారాలను వెల్లడించింది లోక్‌సత్తా మాత్రమే. విభజన చట్టంలోని పన్ను రాయితీలు, ప్రత్యేక సాయం అవన్నీ ఆరోజు నేను ప్రతిపాదించినవే. కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆ పరిష్కార మార్గాలను తుంగలోకి తొక్కుతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా కొంతవరకైనా మేలు జరుగుతుందని ఆశించాను. ఇవి జరగని కారణంగా నేను మనస్తాపం చెంది మీ అందరితో కలిసి పార్టీలకు, పక్షపాతాలకు అతీతంగా ఈ కింది నాలుగు డిమాండ్ల సాధన కోసం మార్చి 3, 2015 నుంచి 'తెలుగు భవిత' సంకల్ప దీక్షలు చేపట్టాలని నిర్ణయించుకున్నాను.

**1. రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం వెంటనే ప్రకటించాలి:**

14వ ఆర్థిక సంఘం లెక్కల ప్రకారం, వచ్చే నాలుగున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కి సుమారు రూ. 22,113 కోట్లు రెవిన్యూ లోటు ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వయంగా ఇచ్చిన అంకెల ఆధారంగా ఆర్థిక సంఘం తేల్చిన లెక్క. ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ లెక్కలని ప్రకటించలేదు. అసలు ఆంధ్రప్రదేశ్‌కి ఎంత ఆదాయం లోటు ఉందో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి. ఈ లోటు నిర్ధారణ అయితే ఎంత ఉన్నా కేంద్రప్రభుత్వం పూర్తిగా భరించాలి.

**2. పోలవరం వెంటనే పూర్తి చేయాలి:**

తెలుగు ప్రజలందరికీ మేలు చేసే పోలవరం ప్రాజెక్టును నాలుగేళ్లలో, ఈ పార్లమెంటు పదవీకాలం ముగిసేలోగానే పూర్తిచేయాలి.

**3, పరిశ్రమలకు పన్ను రాయితీలు - ప్రత్యేక హోదా**

వేగంగా పారిశ్రామికాభివృద్ధికి, ఉద్యోగాల సృష్టికి వీలుగా కార్పొరేట్, సెంట్రల్ ఎక్సయిజ్ పన్ను రాయితీల్ని 10ఏళ్ల పాటు వర్తించేలా వెంటనే ప్రకటించాలి. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు ప్రత్యేక హోదా కల్పించాలి.

**4. మౌలిక సదుపాయాలు:**

ఈ రాయితీలతో రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంస్థల ఏర్పాటు కేంద్రం బాధ్యత. ఈ సంస్థలు, సదుపాయాలు అన్నీ ఈ పార్లమెంటు పదవీకాలంలోనే పూర్తి కావాలి.

ఈ డిమాండ్ల సాధన కోసం నేను 'తెలుగు భవిత' పేరుతో మీ అందరితో కలిసి సంకల్ప దీక్షను ప్రారంభిస్తున్నాను.

ఇట్లు

మీ జయప్రకాష్ నారాయణ్

(విభజన హామీల అమలు కోసం రాయలసీమ, ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాల్లో 'తెలుగు భవిత' సంకల్ప దీక్షలు చేపట్టిన అనంతరం.. డా॥ జేపీ మార్చి 15, 2015న హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంపై మీడియా రిలీజ్ ఇది) ..

# విభజన హామీలు అమలయ్యేలా కేంద్రం మీద అఖిలపక్ష పోరాటానికి ఎ.పి, తెలంగాణ సీఎంలే చొరవ తీసుకోవాలి

## -లోక్‌సత్తా రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవ తీర్మానం-

విభజన సమయంలో రెండు తెలుగు రాష్ట్రాలకూ చట్టపరంగా, పార్లమెంటు లోనూ ఇచ్చిన హామీల్ని వెంటనే అమలు చేయించేలా అన్ని పార్టీలతో కలిసి కేంద్రప్రభుత్వం మీద పోరాటానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్య మంత్రులిద్దరూ చొరవ తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. "ఇది అధికార పార్టీల సొంత వ్యవహారం కాదు, తెలుగు ప్రజల భవిష్యత్తుకి సంబంధించింది, కాబట్టి తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి" అని డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తామంటూ ఇచ్చిన హామీని కేంద్రం నెరవేర్చాల్సిందేనని స్పష్టంచేసింది. సమావేశానికి రాష్ట్రాలలో, కేంద్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న తెదేపా, తెరాస, వైకాపా, బీజేపీ రాకపోవటం వల్ల వారు పరిష్కారంలో భాగమయ్యే ఒక గొప్ప అవకాశాన్ని కోల్పోయినట్టు భావిస్తున్నామని, తెలుగు ప్రజల ప్రయోజనాల కన్నా వేరే అంశాలు వారికి ముఖ్యంగా ఉన్నట్టు కనిపిస్తోందని అసంతృప్తిని వ్యక్తం చేసింది. వారు కూడా హాజరై ఉన్నట్టయితే సమావేశంలో కార్యాచరణకు స్పష్టమైన రూపాన్ని ఇచ్చి ఉండేవారమని, అధికారంలో ఉన్న పార్టీలు కాబట్టి వారితో కూడా సంప్రదించాక ఉమ్మడి కార్యాచరణను ఖరారు చేస్తామని ప్రకటించింది. తెలుగు ప్రజల ఆర్థిక భవిష్యత్తుకి, యువతకు ఉద్యోగాలను అందించటానికి అన్ని మార్గాలలో కృషి చేస్తామని రౌండ్‌టేబుల్ సమావేశం తెలిపింది.

**విభజన చట్టం అమలు కోసం లోక్‌సత్తా ప్రారంభించిన 'తెలుగు భవిత' కార్యక్రమంలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ ఆదివారం ఇక్కడ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో అసెంబ్లీ, పార్లమెంటులో ప్రామాణిక చర్చలను తలపిస్తూ సుమారు మూడున్నర గంటలపాటు చర్చ జరిగింది. దేశం నుంచి విడిపోవాలి దగ్గర్నుంచీ పలు అభిప్రాయాలు ప్రజాస్వామ్యయుతంగా, హుందాగా వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నేతలు, వివిధ రంగాలలో అపార అనుభవం ఉన్న పౌర సమాజ ప్రతినిధులు తమ అభిప్రాయాలను వినిపించారు.**

**రౌండ్‌టేబుల్‌ను తొలుత జేపీ ప్రారంభిస్తూ,** ఇది రెండు తెలుగు రాష్ట్రాలకూ సంబంధించిన సమావేశమని, ఒకరికి న్యాయం ఇంకొకరికి అన్యాయం కాదని అంటూ, రెండు రాష్ట్రాల నేతలు, ప్రజలు కలసికట్టుగా కేంద్రం నుంచి సాధించుకోవాల్సిన నాలుగు ప్రధాన ఆర్థిక డిమాండ్లను ప్రవేశపెట్టారు: 1) ఆంధ్రప్రదేశ్‌కు ఎంత రెవిన్యూ లోటు ఉన్నా పూర్తిగా కేంద్రమే భర్తీ చేసి తీరాలి. అయితే ఎంత రెవిన్యూ లోటు ఉందో ఇప్పటివరకూ ఎ.పి ప్రభుత్వం స్పష్టంగా అధికారిక ప్రకటన చేయలేదు. బడ్జెట్‌లో కూడా వివరాలు లేవు. రాష్ట్రం ఇచ్చిన అంకెలు ఆధారంగానే రూ. 22,113 కోట్ల లోటు ఉందని 14వ ఆర్థిక సంఘం ఫిబ్రవరి 26న విడుదల చేసిన నివేదికలో స్పష్టంచేస్తోంది. ఇది తప్పు అయితే, తాయిలాల పథకాలను, ఆడంబరపు ఖర్చును కలపకుండా వాస్తవ రెవిన్యూ లోటు ఎంత ఉందో ప్రామాణిక అంకెలతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం ప్రకటించాలి. ఎంత లోటు ఉంటే అంత లోటునూ కేంద్రం నుంచి ఒక హక్కుగా మనం సాధించుకోవాలి. 2) తెలంగాణ, రాయలసీమలో మిగులు జలాలు ఆధారంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు నికర జలాలు అందించేందుకు, కోస్తాలో ఆయకట్టును స్థిరీకరించేందుకు దోహదపడే బహుళార్థ పోలవరం ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయాలి. 3) తెలంగాణలో హార్టికల్చర్ వర్సిటీ, 4,000 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు, హైదరాబాద్‌తో మారుమూల జిల్లా ప్రాంతాల అనుసంధానం వంటి హామీలు, ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ విద్య, వైద్య సంస్థలు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటును ఈ పార్లమెంటు పదవీకాలం లోనే పూర్తిచేయాలి. 4) ఉద్యోగాలకు అత్యంత కీలకమైన పారిశ్రామికాభివృద్ధికి ఉత్తరాంచల్, హిమాచల్‌ప్రదేశ్‌తో సమానంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణలోని వెనకబడిన ప్రాంతాలకు పన్ను రాయితీల్ని ప్రకటించి పక్క రాష్ట్రాలకు కూడా సమస్యలేకుండా కొత్తగా వచ్చే పరిశ్రమలకే వర్తింప

చేయాలి. పెట్టుబడి, డిప్రీసియేషన్ అలవెన్సులతో పెద్దగా ఒరిగేదేమీ లేదు.

ఈ డిమాండ్ల పరిధిలో చర్చ చేయాలని జేపీ సూచించారు. తెలుగు ప్రజల సమస్యల్ని తెలుగువారే పరిష్కరించుకుని కేంద్రం ముందు డిమాండ్లు పెడదామని రాష్ట్ర విభజన సమయంలో పరిష్కారాన్ని అసెంబ్లీలో చెప్పింది లోక్‌సత్తా మాత్రమేనని, ఇందులో భాగంగా ప్రత్యేక ప్రతిపత్తి అనే పదాన్ని ఉపయోగించింది కూడా తొలుత తానేనని గుర్తు చేశారు. ప్రత్యేక ప్రతిపత్తి సహా ఇతర అంశాలతో 2014, జనవరి 18న తాను అసెంబ్లీలో ఇచ్చిన ప్రామాణిక పరిష్కారాలే ఆ తర్వాత విభజన చట్టంలో, పార్లమెంటులో ప్రధానమంత్రి, బీజేపీ నేతల హామీల్లో చోటుచేసుకున్నాయని వివరించారు. అయితే ఆనాడున్న ప్రణాళికాసంఘాన్ని రద్దు చేసి ఇప్పుడు నీతి ఆయోగ్‌ని తేవటం వల్ల ప్రత్యేక ప్రతిపత్తి ఉండాలా, వద్దా అనే మీమాంస నెలకొందని, దాంతో పాటు బీహార్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి కూడా అభ్యంతరాలు వస్తున్నాయని, ఫెడరలిజం, దేశ సమగ్రత నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్రతిపత్తే ఇవ్వాలంటే జాప్యం జరగొచ్చు కాబట్టి ప్రత్యేక ప్రతిపత్తి పేరుతో సంబంధం లేకుండా ఆ హామీలకు తగిన నిధుల్ని కేంద్రప్రభుత్వం వెంటనే కేటాయించాలని డిమాండ్ చేయటం మేలని అన్నారు. అయితే హామీ ఇచ్చినప్పుడు లేని అభ్యంతరాలు కేంద్రానికి ఇప్పుడెందుకని, కేంద్రం సమస్యలతో సంబంధం లేకుండా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్రతిపత్తి ఇస్తామన్న హామీని నెరవేర్చాల్సిందేనని సమావేశంలో పలువురు బలంగా అభిప్రాయపడటంతో, ఆ తర్వాత జేపీ ఆ డిమాండ్‌కు మద్దతిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని సమావేశ తీర్మానంగా ప్రకటించారు.

**కాంగ్రెస్ నేత మల్లు రవి మాట్లాడుతూ,** పరిష్కారాల్ని, ఫెడరలిజాన్ని, దేశసమగ్రతని సమతులపరుస్తూ పరిష్కరించగల నేత జేపీ అని, విభజన చట్టం అమలుకు ప్రజాభిప్రాయంతో ఒత్తిడి పెంచాలని సూచించారు. ప్రాణహిత–చేవెళ్లకు జాతీయహోదాను కూడా రౌండ్‌టేబుల్ డిమాండ్ల జాబితాలో చేర్చాలని కోరారు.

**సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాం నరసింహారావు మాట్లాడుతూ,** తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు విభజన చట్టం అమలు కావటం లేదన్నారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై ఇంతవరకూ అధ్యయనం లేదన్నారు. కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు నిధుల్ని సాధించుకునేందుకు ఈ పోరాటంలో సీపీఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభాగాలు లోక్‌సత్తా వెంట ఉంటాయని హామీ ఇచ్చారు. **సీపీఎం నాయకుడు సీహెచ్ సీతారాములు మాట్లాడుతూ,** విభజన చట్టం వచ్చి పది మాసాలవుతున్నా సక్రమంగా అమలుకాకపోవటంపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ పట్టించుకోవటం లేదని, అసెంబ్లీ సమావేశాల్లో వైకులు విరగ్గొట్టటం, దూషించుకోవటం తప్ప ఈ అంశం మీద చర్చ లేదని అన్నారు. కేంద్రం నుంచి సాధించుకోవటానికి అన్ని పార్టీలూ కలిసికట్టుగా కృషి చేయాలని, ఇందుకు లోక్‌సత్తాకు సీపీఎం పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలిపారు.

సమస్యల్ని పరిష్కరించాల్సిన కేంద్రం చోద్యం చూస్తుంటే, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఇంకా వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిని పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని **ఆలిండియా కిసాన్ సభ నేత సారంపల్లి మల్లారెడ్డి విమర్శించారు.** ఉద్దేశపూర్వకంగా వెనకబాటుతనాన్ని కొనసాగిస్తున్నారని, వారు ఆ తీరుని మార్చుకుని చట్టం అమలుకు అందరినీ కలుపుకుని వెళ్లాలన్నారు.

రెండు రాష్ట్రాల్లో 10 లక్షల బీటెక్ విద్యార్థులు సరైన నైపుణ్యాలు లేక రోడ్ల వెంట తిరుగుతున్నా వారి ఉద్యోగాల గురించి పట్టించుకోవటం లేదని **ప్రజ్ఞాభారతి డైరెక్టర్ హనుమాన్ చౌదరి** అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కోడిపందాలకు, సీజన్‌కో పండగకు డబ్బులు దుబారా చేయటం ఆపి పాలనను సక్రమంగా నడిపిస్తే కేంద్రం మీద ఒత్తిడి తేవటం సులభమవుతుందన్నారు.

సరైన సమయంలో లోక్‌సత్తా ఇందుకోసం దీక్షలు, రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని, ఈ అంశంపై లోక్‌సత్తా నిర్వహిస్తున్న మూడో సమావేశమని **ఆంధ్ర మేధావుల ఫోరం నేత చలసాని శ్రీనివాస్** అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు తొలి బడ్జెట్ నుంచీ లోటు ఉంటుందని ప్రధాని పార్లమెంటులో చెప్పారని, ఆ లోటును భర్తీ చేయాల్సిందేనని అన్నారు. పునరావాసాన్ని సక్రమంగా పూర్తి చేశాకే పోలవరం నిర్మాణంపై ముందుకెళ్లాలన్నారు. విభజన చట్టంలో హామీల సాధనకు అన్ని పార్టీలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి పోరాటం చేయాలని **జనచైతన్య వేదిక నేత లక్ష్మణ్ రెడ్డి** సూచించారు.

**సీనియర్ పాత్రికేయుడు, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ మూర్తి మాట్లాడుతూ,** అన్ని ప్రాంతాలలో ఉద్రిక్తతలు ఉన్న సమయంలో కూడా జేపీ చాలా స్పష్టమైన వైఖరి తీసుకుని పరిష్కారాన్ని ప్రకటించారన్నారు. ఇప్పుడు ఉద్రిక్తతలు సద్దుమణిగాయని, అందరం కలిసి వాటి అమలును సాధించుకోవాలని అన్నారు. అడగందే అమ్మయినా అన్నం పెట్టదు కాబట్టి కేంద్రం మీద ఒత్తిడి పెంచి హామీల్ని అమలుచేయించుకోవాలన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఓటింగ్ సరళి మారుతుంది అనుకుంటే కేంద్రమే దిగివస్తుందన్నారు.

అడక్కుండానే కేంద్రం కేజీ బేసిన్ నుంచి తెలంగాణకు 248 మెగావాట్లు, ఆంధ్రప్రదేశ్‌కి 202 మెగావాట్ల విద్యుత్‌కు గ్యాస్‌ను కేటాయించిందని, విభజన చట్టం అమలులో కేంద్ర నిర్లక్ష్యంపై కూడా చర్చలు, దండోపాయం వంటి పలుమార్గాల ద్వారా పోరాడి నిధుల్ని సాధించుకోవాలని **ఆచార్య సి. లక్ష్మన్న** అన్నారు. చట్టబద్ధంగా ఇచ్చిన హామీ అమలుకు ఆందోళనలు చేయాల్సి రావటం సిగ్గుచేటని, ఎంతో భిన్నత్వమున్న భారతదేశంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో కేంద్రం చాలా సున్నితంగా వ్యవహరించాలని **రాజకీయ విశ్లేషకుడు సి. నరసింహారావు** అన్నారు. కేంద్రప్రభుత్వం ఖచ్చితంగా విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తోందని, దీని మీద న్యాయస్థానాలలో సవాలు చేస్తే కేంద్రం సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని కేంద్ర న్యాయశాఖ మాజీ కార్యదర్శి **కళానిధి సత్యనారాయణ మూర్తి అన్నారు.** పార్లమెంటులో ప్రధాని ఇచ్చిన హామీల వివరాలపై చర్యలను బైటపెట్టమని అడగాల్సుందన్నారు. తెలుగు ప్రజల సమస్యలకు తెలుగు అసెంబ్లీలోనే పరిష్కారం చూపిన పార్టీ లోక్‌సత్తా అని, వాటిని సాధించుకోవటం ఇప్పుడు మనందరి సమష్టి కర్తవ్యమని **లోక్‌సత్తా పార్టీ ప్రవాస భారతీయ విభాగం నేత కళ్యాణ్** అన్నారు.

ఈ చట్టం అమలులో మైనారిటీల మద్దతు పూర్తిగా ఉంటుందని ఎ.యు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు **ఆచార్య అన్వర్‌ఖాన్** హామీ ఇచ్చారు. రైతులకు పంటల ధరల మీద 3-4 శాతం పెంచితే ఉద్యోగులకు 43 శాతం పెంచారని, వారి జీవితాల్ని బాగు చేయకపోయినా కనీసం ఆత్మహత్యల్ని ఆపేందుకు సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయాలని **రైతు నేత చెంగల్రెడ్డి** కోరారు. కమ్యూనల్ అవార్డుకు వ్యతిరేకంగా గాంధీజీ నిరాహారదీక్ష చేస్తున్నప్పుడు దేశసమగ్రత కోసం డా॥ అంబేద్కర్ తన డిమాండ్‌ను పక్కనపెట్టారని, బలహీనమైన నాయకుల వల్లే ఈరోజు తెలుగు రాష్ట్రాల ప్రజలకు కష్టాలు వచ్చాయని **ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఆర్.డి విల్సన్** అన్నారు. పేరు, అధికారం కోసం చూసుకోకుండా పరిష్కారం కోసం కృషి చేస్తున్న జేపీ వల్ల తెలుగు ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్న విశ్వాసం ఉందన్నారు. హైకోర్టు విభజనను కూడా డిమాండ్లలో చేర్చాలని **లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండారు రామ్మోహనరావు** కోరారు. రెండు రాష్ట్రాలకూ మంచి జరగాలన్నదే తమ లక్ష్యమని, తెలంగాణకు అవసరమైన పూర్తి తోడ్పాటును ఇస్తామని **లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డా॥ పట్టాభి రామయ్య** తెలిపారు.

సమావేశంలో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ, జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా ప్రవీణ్, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ, పార్టీ నేతలు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ✦

# నదీజలాలపై ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హక్కు లేదు

నది అనేది జాతీయ సంపద అని, ఏ రాష్ట్రమూ నదిపై ప్రత్యేక యాజమాన్య హక్కును ప్రకటించుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "ఏదో ఒక రాష్ట్రంలోనే నది ఉందని చెప్పడానికి వీల్లేదు. ఇతర రాష్ట్రాల న్యాయబద్ధ వాటాను తోసిపుచ్చేలా ప్రిస్క్రిప్టివ్ హక్కును బలవంతంగా పొందలేవు. జలవనరుల కొరత తీవ్రంగా ఉన్నందున, రాష్ట్రాల తీవ్ర వాదనల నేపథ్యంలో ఇక నుంచి.. ఏ అవసరాల కోసం కేటాయించారో ఆ అవసరాలకే నీటిని వినియోగించాలి" అని ధర్మాసనం పేర్కొంది. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న సూత్రాన్ని, బెంగళూరు అంతర్జాతీయ స్థాయి నగరంగా అవతరించిందన్న అంశాన్ని పరిగణలోకి తీసుకుంటూ కర్ణాటకకు కావేరీ జలాల్లో వాటాను 14.75 టీఎంసీలు పెంచింది. ఈ మేరకు.. దశాబ్దాల పాటు తమిళనాడు-కర్ణాటక మధ్య అగ్గి రాజేసిన కావేరీ జలాల కేసులో తీర్పునిచ్చింది. ఈ తీర్పు మరో 15 ఏళ్లపాటు అమల్లో ఉంటుందని చెప్పింది. కావేరీ జలవివాదంపై సుప్రీంకోర్టు తుదితీర్పు ఇవ్వడంతో ఇక కృష్ణా జల వివాదంపై కూడా కదలిక వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. కావేరీ ట్రైబ్యునల్ తీర్పులో సుప్రీంకోర్టు కొన్ని మార్పులు చేసి, ట్రైబ్యునల్ తీర్పే తుది కాదని సంకేతాలిచ్చింది. ఈ పరిణామాలతో భవిష్యత్తులో తమకు కూడా లాభం చేకూరే అవకాశముందని తెలుగు రాష్ట్రాలు భావిస్తున్నాయి. బెంగళూరు పద్ధతిలోనే హైదరాబాద్‌కూ, మిషన్ భగీరథ తాగునీటి వినియోగానికీ నీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ కోరుతోంది. అలాగే దేశంలోని పలు రాష్ట్రాల మధ్య ఉన్న జలవివాదాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నట్టు, ఇందుకోసం జాతీయ స్థాయిలో ఒకే ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు (ఈ బిల్లు ఇప్పటికే పార్లమెంటు ముందు ఉంది) కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రుల హైదరాబాద్ సమావేశంలో ప్రకటించింది. ✦

*(రెవెన్యూ లోటు పూడ్చటం ఆంధ్రప్రదేశ్‌కే ప్రత్యేకం కాదంటూ అక్టోబర్ 23, 2015న మీడియా ద్వారా ప్రజలకు జేపీ వాస్తవం తెలియచేశారు. ప్రభుత్వాన్ని, పార్టీల్ని మేలుకొలిపే ప్రయత్నం చేశారు. ఆర్థిక సంఘం నివేదికలోని వివరాల్ని విడుదల చేశారు. అప్పటి మీడియా రిలీజ్‌లోని కొన్ని అంశాలివి)..*

# రెవెన్యూ లోటును పూడ్చటం కూడా ఆంధ్రప్రదేశ్‌కే ప్రత్యేకం కాదు, ఆర్థిక సంఘం పత్రం విడుదల

ఇతర రాష్ట్రాలకు ఇవ్వనిది పిసరంత కూడా రాష్ట్ర విభజనతో హైదరాబాద్‌ని కోల్పోవటం వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కి ఇవ్వలేదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ స్పష్టం చేశారు. చివరికి ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ లోటును పూడ్చటంలో కూడా కేంద్రప్రభుత్వ ప్రత్యేక సాయం, సానుభూతి, తెలుగువారి పట్ల ప్రేమ ఏమీ లేవన్నారు. ఇందుకు సంబంధించి 14వ ఆర్థిక సంఘం నివేదికలోని వివరాల పత్రాన్ని జేపీ విడుదల చేశారు. 2015-20 గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా కేంద్రం నుంచి 42శాతం నిధులు బదిలీ చేసినా రెవిన్యూలోటు ఉన్న అన్ని రాష్ట్రాలకూ ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ఈ డాక్యుమెంట్‌లో స్పష్టంగా ఉందని, రెవిన్యూ లోటు భర్తీ కింద వచ్చే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.22,113 ఇస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కి రూ.11,760 కోట్లు, చిన్న రాష్ట్రమైన కేరళకి రూ.9519 కోట్లు ఇస్తున్నారని, ఈ మాటను చాలా స్పష్టంగా తెలుగు ప్రజలు గుర్తించాలని అన్నారు.

*Fourteenth Finance Commission*

11.37 **A total revenue deficit grant of Rs. 1,94,821 crore is recommended during the award period for eleven States.** The year-wise details of States that are to receive this grant are given in Table 11.3. There are seven States - Andhra Pradesh, Himachal Pradesh, Jammu and Kashmir, Manipur, Mizoram, Nagaland and Tripura - that will need a revenue deficit grant for each of the years of our award period. In addition, there are four States - Assam, Kerala, Meghalaya, and West Bengal - that will need a revenue deficit grant for at least one of the years of our award period.

**Table 11.3 : Grants-in-aid for Revenue Deficit (2015-20)**

*(Rs. crore)*

| State | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 | 2015-20 |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| Andhra Pradesh | 6609 | 4930 | 4430 | 3644 | 2499 | 22113 |
| Assam | 2191 | 1188 | Nil | Nil | Nil | 3379 |
| Himachal Pradesh | 8009 | 8232 | 8311 | 8206 | 7866 | 40625 |
| Jammu & Kashmir | 9892 | 10831 | 11849 | 12952 | 14142 | 59666 |
| Kerala | 4640 | 3350 | 1529 | Nil | Nil | 9519 |
| Manipur | 2066 | 2096 | 2091 | 2042 | 1932 | 10227 |
| Meghalaya | 618 | 535 | 404 | 213 | Nil | 1770 |
| Mizoram | 2139 | 2294 | 2446 | 2588 | 2716 | 12183 |
| Nagaland | 3203 | 3451 | 3700 | 3945 | 4177 | 18475 |
| Tripura | 1089 | 1089 | 1059 | 992 | 875 | 5103 |
| West Bengal | 8449 | 3311 | Nil | Nil | Nil | 11760 |
| **Total State** | **48906** | **41308** | **35820** | **34581** | **34206** | **194821** |

ఐఐటీ, ఐఐఐటీ, ఐఐఎం వంటివి ప్రతి రాష్ట్రానికీ ఇస్తున్నారని, పెట్రోలియం వర్సిటీ ఒక్కటే అదనంగా వచ్చిందని, దాని వల్ల ఏం ఒరుగుతుందో చూడాల్సుందని జేపీ అన్నారు. ఏపీ నగరాలకు అమృత్ పథకం పెట్టాం, స్మార్ట్ సిటీల సాయం అందిస్తాం, 24 గంటలు విద్యుత్తు ఇచ్చే రాష్ట్రాలలో ఏపీని చేర్చాం వంటివి మభ్యపెట్టే మాటలని, ఇలాంటి సాయాలు అన్ని రాష్ట్రాలకూ అందుతున్నాయని అన్నారు. ఈ మాటలు అబద్ధమైతే రుజువు చేయాలని సవాలు చేశారు.

**రాయలసీమ, ఉత్తరాంధ్ర 7 జిల్లాలు ప్రత్యేక హోదా రాష్ట్రాల కంటే వెనకబడి ఉన్నాయి**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు కావలసిన మూడు నాలుగు అర్హతల్లో ఒక్కటే ఉందని చెబుతున్నారని, అయితే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో రాయలసీమ, ఉత్తరాంధ్రకు చెందిన 7 జిల్లాలు ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నాయని జేపీ గణాంకసహితంగా వివరించారు. ప్రకాశం జిల్లాలోని మార్కాపురాన్ని కూడా రాయలసీమలో భాగంగా గుర్తించాలన్నారు. ప్రత్యేక హోదా కలిగిన చిన్న రాష్ట్రాలు సిక్కిం, మిజోరాం, నాగాలాండ్ వంటి వాటిని మినహాయించి **ఆంధ్రప్రదేశ్‌తో పోల్చదగిన అసోం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ గణాంకాలను, రాయలసీమ గణాంకాలను పోల్చి చూపుతూ మరో పత్రాన్ని జేపీ విడుదల చేశారు.** "శిశు మరణాల (ప్రతి 1000కి) రేటు అసోం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలలో వరసగా 55, 38, 36, 41 ఉండగా, రాయలసీమలో 44.5 ఉంది. ఆడపిల్లల అక్షరాస్యత 66,76,70,56 ఉండగా, రాయలసీమలో 56.5 ఉంది. మంచినీళ్ల సదుపాయం లేమి 45, 44, 41, 51 ఉండగా, రాయలసీమలో 71 శాతం ఉంది. పేదరికంలో ఉన్న జనాభా ఆ రాష్ట్రాల్లో 32, 8, 11, 10 ఉండగా, రాయలసీమలో 28శాతం ఉంది'' అని వివరించారు. ఉత్తరాంధ్ర వివరాలు త్వరలో సమగ్రంగా వివరిస్తానన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు, తెలంగాణలోని 10 జిల్లాలకు మొత్తం 23 జిల్లాలకూ ప్రత్యేక హోదా ఇస్తే తెలుగువాడిగా సంతోషిస్తానని, కనీసం.. పాలకుల నిర్వాకం వల్ల వెనకబడిపోయి ప్రత్యేక హోదా రాష్ట్రాల కంటే కూడా దయనీయంగా ఉన్న జిల్లాలకైనా ప్రత్యేక హోదా సహాయాన్ని అందించాలని జేపీ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ గణాంకాలున్న జిల్లాలకు ప్రత్యేక హోదా సాయం అందిస్తే అభ్యంతరం చెప్పాల్సిన పనిలేదన్నారు. కొత్తగా వచ్చే పరిశ్రమలకు నూరుశాతం ఈ పన్ను రాయితీల్ని కల్పించటం వల్ల కేంద్రానికి ఆదాయం తగ్గదని, దీర్ఘకాలంలో పెరుగుతుందని జేపీ అన్నారు. ప్రత్యేక హోదా పేరుతో ఈ రాయితీల వల్లే సమర్థ నాయకత్వం ఉన్న హిమాచల్ ప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో దూసుకుపోతోందన్నారు. లోక్‌సత్తా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా పోతినేని, ఏపీ అధికార ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ సమావేశంలో పాల్గొన్నారు. ✦

*(ఏపీకి ప్రత్యేక తరగతి హోదాపై వాస్తవాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'హోదా దగా.. కింకర్తవ్యం?' పేరుతో నవంబర్, 2016లో లోక్‌సత్తా విడుదల చేసిన బుక్‌లెట్‌లోని కొన్ని అంశాలు)..*

# రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా 'వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా'ను ప్రత్యామ్నాయంగా అడుగుదాం

ప్రత్యేక హోదా వల్ల వచ్చే రాయితీలు, ప్రోత్సాహాల ఫలితంగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో అనేక పరిశ్రమలు వచ్చి లక్షలాదిమందికి ఉపాధి లభించిందని సాక్షాత్తూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో సభ్యుడు కె.సి త్యాగి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కోటి జనాభా కలిగిన ఉత్తరాఖండ్‌లో హోదా వచ్చిన నాటికి అంటే 2008-09 నాటికి 1907 ఫ్యాక్టరీలు ఉంటే, ఐదేళ్ల తరువాత 2012-13 నాటికి వాటి సంఖ్య 14,440కి పెరిగింది. ఉద్యోగుల సంఖ్య 2008-09లో 1,72,861 ఉంటే, 2012-13నాటికి 6,35,759కి పెరిగారు. ఈ 1907 పరిశ్రమల మూలధన పెట్టుబడి (క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) విలువ 2008-09నాటికి 21,898కోట్లు ఉంటే, అదే 2012-13నాటికి 1,02,711కోట్లకు పెరిగింది. అదేవిధంగా 68లక్షలు జనాభా కలిగిన హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ పదమూడు సంవత్సరాలలో దాదాపు 10,864 పరిశ్రమలు కొత్తగా ఏర్పడ్డాయి. రూ.15,324.25కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ పరిశ్రమల ద్వారా 1,29,443మందికి కొత్తగా ఉద్యోగాలు లభించాయి. అంటే హోదా కారణంగా రెండు శాతం మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించినట్టయింది. ఇవికాక ఈ పరిశ్రమలకు అనుబంధంగా అనేక చిన్న పరిశ్రమలు వేలసంఖ్యలో స్థాపితమై లక్షలాదిమందికి ఉపాధి దొరికింది. ఇదంతా ప్రత్యేక తరగతి హోదా వల్ల వచ్చే పారిశ్రామిక రాయితీల వల్లే సాధ్యమయిందన్నది వాస్తవం.

**సుజనా చౌదరి, సీఎం రమేష్, గల్లా వంటి వాళ్లూ రాయితీల కోసమే అక్కడ పెట్టుబడి పెట్టారు**

అందుకే తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఏపీకి సాయంగా హోదా పేరుతో పారిశ్రామిక రాయితీలు ఇస్తే తమ పరిశ్రమలు పొరుగు రాష్ట్రానికి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖ రాశారు. రాయితీలు, ప్రోత్సాహకాలు ఉండటం వల్లే మన రాష్ట్రానికి చెందిన రెడ్డీస్ ల్యాబరేటరీస్, అరబిందో ఫార్మా, జెన్ టెక్నాలజీ వంటి సంస్థలతోపాటు ర్యాన్‌బ్యాక్సీ, సిప్లా, డాబర్, బ్లూస్టార్, అంబుజా, మైక్రోటెక్ వంటి దిగ్గజ సంస్థలన్నీ హోదా కలిగిన హిమాచల్ ప్రదేశ్‌లో తమ యూనిట్లను నెలకొల్పాయి. పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టే ముందు తమకు ఏ రాష్ట్రంలో రాయితీలు ఇస్తారు?



ప్రోత్సాహకాలు లభిస్తాయి? వాటి వలన కలిగే తక్షణ ప్రయోజనాలేమిటి? దీర్ఘకాలంలో వచ్చే లాభాలేమిటి? అని ఆలోచిస్తారే తప్ప వారికి ఏ ప్రాంతంపైనా ప్రేమకానీ, ద్వేషంకానీ ఉండవు. ప్రత్యేక హోదా వద్దు, ప్యాకేజీయే ముద్దు అని చెబుతున్న కేంద్ర మంత్రి సుజనా చౌదరి న్యూ ల్యాండ్స్ ఇండస్ట్రీస్ పేరుతో ఫ్యాన్లకు సంబంధించిన తయారీ యూనిట్‌ను, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ నార్త్ ఈస్ట్రన్ పవర్ ప్రాజెక్టును, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శివశక్తి బయోటెక్ ప్లాంటెక్ లిమిటెడ్ అనే కంపెనీని ఉత్తరాఖండ్‌లో ఏర్పాటు చేసుకుంటే, ఎంపీ గల్లా జయదేవ్ ఉత్తరాంచల్‌లో అమరరాజా కంపెనీ బ్యాటరీల ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇవన్నీ వారు స్వయంగా తమ పరిశ్రమల వార్షిక నివేదికల్లో వెల్లడించిన సంగతులే. అయితే వీరే ఈవేళ ప్రత్యేక తరగతి హోదాకి, పారిశ్రామిక రాయితీలకు సంబంధం లేదని వాదించడం విడ్డూరం. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోతుండటం వల్ల మిగిలిన ఏపీకి ప్రత్యేక తరగతి హోదా రావాలని మొట్టమొదట ప్రతిపాదించింది లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్! రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేక హోదా అంటే ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వచ్చే అవకాశముంది కాబట్టి, అత్యంత వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలని జనవరి 18, 2014న అసెంబ్లీలో గణాంకసహితంగా ప్రతిపాదించారు. దక్కనులో, దక్షిణాదిలో ఇప్పటివరకూ లేని ఈ హోదాను సీమకు ఇవ్వటంతోపాటు వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక సాయం ఇవ్వాలని కోరారు. ఏపీకి వచ్చే లోటుపై జేపీ బైటపెట్టిన లెక్కల్ని, చేసిన ప్రత్యేక హోదా

ప్రతిపాదననే ఆ తర్వాత పార్టీలకతీతంగా వ్యవహరించి కాంగ్రెస్, బీజేపీ పార్లమెంటులో తీసుకున్నాయి. అయితే జేపీ రాయలసీమకు హోదా, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక సాయం ప్రతిపాదిస్తే, ఆ పార్టీలు ఏపీ మొత్తానికీ ప్రత్యేక హోదా అని తెలిసోతెలియకో, ఓట్ల కోసమో ప్రజలకు తీవ్ర నష్టం చేశాయి. ఓట్లు, సీట్లు వున్న పార్టీలు రాష్ట్రమంతటికీ హోదా తెస్తామంటే మనం అడ్డంకొట్టటమెందుకని లోక్‌సత్తా కూడా అందుకు మద్దతిచ్చింది.

**హోదా ప్రతిపాదన వెనుక రాయితీలు కీలకం**

అసెంబ్లీలో జేపీ చేసిన ప్రత్యేక తరగతి హోదా ప్రతిపాదనలో కూడా 100శాతం కార్పొరేట్, ఎక్సయిజ్ పన్ను మినహాయింపులతో కూడిన పారిశ్రామిక రాయితీలు హోదాలో కీలక భాగంగా వున్నాయి. హోదాలో భాగంగా పన్ను రాయితీలు విధానపరంగానే కాకుండా రాజకీయంగా కూడా స్థిరపడిన నిబంధన.

**చంద్రబాబుకి, కేంద్ర ప్రభుత్వానికి ఇక్కడ మూడు సూటి ప్రశ్నలు:**

1) ఏపీ ప్రత్యేక హోదాకు ఒప్పుకోని రాష్ట్రాలు.. హోదాతో సమానంగానో, ఎక్కువగానో సాయం అందిస్తే ఊరు కుంటాయా?

2) ప్రత్యేక హోదాలో పారిశ్రామిక రాయితీలు భాగం కాకపోతే.. ఏపీకి హోదా ప్రతిపాదన చర్చ మొదలవగానే అలా పన్ను రాయితీలు ఇవ్వటం తమకు నష్టమనే ఆందోళన వ్యక్తం చేస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఎందుకు కేంద్రానికి లేఖ రాశారు?

3) ప్రత్యేక హోదా పారిశ్రామిక రాయితీల వల్ల ఒరిగేదేమీ లేదని కూడా ప్రచారం చేస్తున్న మీరు.. అంత భారీ లాభం చేకూరే అవకాశం ఉండకపోతే ప్రత్యేక సాయంలో ఎందుకు చేర్చలేదు, ప్రత్యేక హోదాలో అవి భాగం కాదని మీరు పనిగట్టుకుని ఎందుకు ప్రచారం చేయాల్సివస్తోంది?

నిజానికి లోక్‌సత్తా ప్రత్యేక హోదాను ప్రతిపాదించటం వెనక ఉన్న అంశాలలో రెవిన్యూ లోటును పూడ్చటం, జాతీయ సంస్థల్ని ఏర్పాటు చేయడం, పారిశ్రామిక రాయితీల్ని ప్రకటించటం ప్రధానమైనవి. వీటిలో మొదటి రెంటినీ కేంద్రం నెరవేరుస్తోంది. రెవిన్యూలోటు పూడ్చటం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా, ఎంత లోటో చెప్పలేకపోతోంది. కాగ్ చెప్పింది కదా, గవర్నర్ చెప్పారు కదా అని దాటవేస్తూ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఆడంబరాలు, సొంత తాయిలాల పథకాలను మినహాయించి పాలనా పరమైన అంశాలలో లోటు ఉందని తేలితే కచ్చితంగా ఆ లోటును పూడ్చుతామని కేంద్రమే చెబుతున్నందున వివాదం లేదు. పైగా రాష్ట్రాలకు కేంద్ర నిధులు 42శాతానికి పెరిగిన నేపథ్యంలో కొంత రెవెన్యూ లోటు కూడా తగ్గినట్టు కనిపిస్తోంది. అలాగే జాతీయ సంస్థల్ని వేగంగానే ఏర్పాటు చేస్తున్నారు. దుగ్గరాజపట్నం, రామాయపట్నం (కాకినాడ–కృష్ణపట్నం మధ్య) వద్ద పోర్టులు వంటి మౌలికవసతుల ఏర్పాటులో ఇంకా వేగం కావాలి. అయితే ఇవన్నీ ఏపీని కేంద్రమే విడగొట్టింది కాబట్టి చేయటం లేదు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల్లో భాగంగా అన్ని రాష్ట్రాలకూ చేస్తున్నారు, ఏపీకీ చేస్తున్నారు. కాబట్టి రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీకి ప్రత్యేక హోదాకు సంబంధించి ప్రధానమైనది – పారిశ్రామిక రాయితీల్ని ప్రకటించటం! పెట్టుబడి తరుగు రాయితీలు వంటివి కాదు నూరుశాతం పన్ను రాయితీల్ని పరిశ్రమలకు ఇవ్వాలి. వ్యవసాయానికి, ఇతరత్రా కొన్ని వడ్డీ రాయితీల్నీ ఇవ్వాల్సుంటుంది. ఇతర రాష్ట్రాలకు ఇబ్బంది లేకుండా కొత్త పరిశ్రమలకే ఈ సబ్సిడీలను వర్తింపచేయొచ్చు.

ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు ఉంటేనే ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక సంస్థలు భారీ పెట్టుబడులతో రాష్ట్రానికి రావడానికి అవకాశాలు బాగా పెరుగుతాయి. నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు రావడంతోపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడుతుంది. కానీ గత రెండున్నరేళ్లుగా ఏనాడూ చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి కావలసింది ఇదీ అని నిర్దిష్టంగా కేంద్రానికి చెప్పలేకపోయారు, అడగలేకపోయారు. విభజన తర్వాత నష్టాలను ఎదుర్కొనే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కనీసం 15 సంవత్సరాలు కల్పిస్తే తప్ప రాష్ట్రం కోలుకోలేదని చెప్పిన ఆయనే ఇప్పుడు కేవలం కొద్దిపాటి సాయానికి తలొగ్గడం అందరినీ విభ్రాంతికి గురిచేస్తోంది. కేంద్ర మంత్రి హోదాలో సుజనా చౌదరి, తెదేపా ఎంపీలు కూడా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం చివరి వరకూ పోరాడతామని అనేకసార్లు ప్రకటనలు చేయడం, పార్లమెంటులో నినాదాలు చేయడం అందరికీ తెలిసిందే. ఇప్పుడందరూ హఠాత్తుగా మాట మార్చారు.

**ప్రత్యామ్నాయం సూచించలేకపోయారు .. లోక్‌సత్తా ప్రతిపాదించినా పట్టించుకోలేదు**

హోదాకు ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని కేంద్రం పలుమార్లు సూచనప్రాయంగా చెప్పినా, ప్రత్యామ్నాయాన్ని చంద్రబాబు సూచించలేదు. రాష్ట్ర విభజన సమయంలో ఎలాగైతే అసెంబ్లీలోనహా ఎక్కడా పరిష్కారం చెప్పకుండా తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీథుల్లో తాకట్టుపెట్టారో, అలాగే ప్రత్యేకహోదా విషయంలో కూడా ఢిల్లీ చెప్పాక రియాక్షన్లే తప్ప సొంత ప్రతిపాదనలు లేవు. పోనీ అన్ని పార్టీలనూ కలుపుకుని అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఢిల్లీని ఒప్పించే ప్రయత్నం చేశారా అంటే అదీ లేదు.

ప్రత్యేక హోదాకు ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వస్తున్నందున ఏపీ అభివృద్ధి సమయం వృధా కాకుండా లోక్‌సత్తా ఒక నిర్మాణాత్మక పరిష్కారం సూచించింది. "రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశంలోని

వెనకబడిన 80-100 జిల్లాలకు ప్రత్యేక హోదా" ఇచ్చేలా కేంద్రానికి ప్రతిపాదించమని కోరింది. దీనివల్ల ఏ రాష్ట్రానికీ అభ్యంతరం ఉండనక్కర్లేదు. దేశంలో ఫెడరలిజం బలపడుతుంది. వెనకబడిన జిల్లాల్లో నుంచి నగరాలను తొలగించి, ఇతర జిల్లాల్లోని (మార్కాపురం లాంటి) మెట్ట ప్రాంతాలను హోదా పరిధిలో చేర్చవచ్చు. దీనికి అవసరమైన బిల్లును కావాలంటే లోక్‌సత్తా తయారుచేసి ఇస్తుందని తెలిపినా ఇందుకు కూడా ఏపీ ప్రభుత్వం స్పందించలేదు.

**రాయితీలు ఉంటే చిన్న యువ ఔత్సాహికులకూ పెద్ద అవకాశాలు**

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కె. తారకరామారావులాగే చంద్రబాబు కూడా పెట్టుబడుల కోసం పెద్ద ప్రయత్నాలే చేస్తున్నా ఆశించిన మేర ఫలితాలు రావటం లేదు. దీనికి చంద్రబాబును తప్పుపట్టలేం. కానీ పన్ను రాయితీల కోసం ఒక హక్కుగా పట్టుబట్టే అవకాశమున్నా జారవిడుస్తూ పరోక్షంగా కొత్త పరిశ్రమల ఏర్పాటుని తానే దెబ్బతీయటాన్ని మాత్రం సహించలేం. 517 పారిశ్రామిక యూనిట్లు రూ.1,43,633కోట్లతో దాదాపు మొదలవనున్నాయని, 2,23,385మందికి ఉపాధి లభించనుందని, ఇంకా లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని కొందరు తెలుగుదేశం నేతలు చెబుతున్నారు. కానీ వాస్తవంలో పెట్టుబడుల ఊపు, ఉద్యోగాల సంఖ్య మందగమనంలో ఉందని అధికారులే చెబుతున్నారు. పరిశ్రమలను, ఉద్యోగాలనిచ్చే హోదా పన్ను రాయితీల్ని డిమాండ్ చేయకుండా 2015 విశాఖ భాగస్వామ్య సదస్సులో రూ.4.67లక్షల కోట్లతో 328 పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని, 10లక్షలకు పైగా ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటే.. చివరికి రూ.46,343కోట్ల పెట్టుబడులతో 43,392 ఉద్యోగాలు వచ్చే 26 ఒప్పందాలు అమలైతే సదస్సు గొప్ప విజయం సాధించినట్టేనని అధికారవర్గాలు తేల్చిచెబుతున్నాయి. సులభంగా వాణిజ్యం చేయటం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో భారతదేశమే పెద్ద ఆశాజనకంగా లేదని అంచనాలు చెబుతున్న తరుణంలో.. దేశంలో ఏపీ, తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచాయని ఈ విదేశీ పెట్టుబడుల యుగంలో మరీ ఎక్కువ సంబరపడలేము గదా! మరోవైపు, సులభ వాణిజ్యంపై ఎన్‌సీఏఈఆర్ (నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లయిడ్ ఎకనామిక్ రీసెర్చి) సర్వే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ నెంబర్‌వన్ ర్యాంకుకు విరుద్ధంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వున్న అవినీతి, రాజకీయ వాతావరణం, కార్మిక స్థితిగతుల వల్ల అక్కడ వ్యాపారాన్ని ఇప్పట్లో విస్తరించాలను కోవటం లేదని పలువురు వాణిజ్యవేత్తలు భావిస్తున్నట్టు సర్వే తెలిపింది. (వ్యవసాయంలో కూడా సంస్కరణలపై ఆంధ్రప్రదేశ్‌కి కేంద్రం కితాబునిస్తే, ఏపీ ప్రభుత్వమే ఏర్పాటు చేసిన 'సెస్' కమిటీ నివేదిక సాగురంగం తీవ్రసంక్షోభంలో ఉందని తేల్చటం గమనార్హం). రాష్ట్రంలో అవినీతి భయంకరంగా వేళ్లూనుకుందని 74.3శాతం మంది వాణిజ్యవేత్తలు అభిప్రాయపడ్డారు. అయితే, పెట్టుబడిదారులు ఇంకా ఆశావహ ధోరణితో వేచిచూడాలనుకుంటున్నట్టు ఎన్‌సీఏఈఆర్ సర్వే తెలిపింది.

అవినీతి నిరోధానికి 'పౌర సేవల చట్టం' (సర్వీస్ గ్యారంటీ) వంటి ఏర్పాట్లు, ఇతర సంస్కరణలతోపాటు పాటు హోదా రాయితీలు ఉంటే చంద్రబాబు పెద్ద తిరగాల్సిన అవసరం లేకుండానే పెట్టుబడులు, ఉద్యోగాలు పెరిగేవనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఇప్పుడు కేంద్రం ప్రకటించిన ప్రత్యేక సాయాన్ని చట్టబద్ధం చేసి అమలుచేసినా, ఆ రుణ రాయితీలు పెద్ద పారిశ్రామికవేత్తలకే పోతాయి తప్ప ఉద్యోగావకాశాల్ని పెంచే స్వదేశీ యువ ఔత్సాహికులకు, మధ్య,పేద తరగతులవారికి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అందే అవకాశాలు తక్కువ. వ్యవసాయానికి ఏమాత్రం సాయం ఉండదు. తమకు నచ్చని శాఖలకు బడ్జెట్ కేటాయింపుల్ని ఎంత చక్కగా పాలకులు పక్కకు మళ్లిస్తున్నారో చూస్తూనే ఉన్నాం. కేంద్రం ప్రత్యేకసాయం ఒకవేళ పూర్తిస్థాయిలో అందినా ఇప్పుడున్న రహస్య పాలన ధోరణుల్నే తప్ప ప్రజాప్రయోజనాలను పెంచలేదు.

**పవన్ సహా ప్రతిపక్షాల పోరాటాల్లో స్పష్టత కావాలి.. రాజకీయల లబ్ధిని వీడి పత్యామ్నాయాలనూ పరిశీలించాలి**

విభజనకు అనుకూలమని చెప్పిన పార్టీలకు ఓట్లు వేసి, తెలంగాణలోని ప్రజల్లో అత్యధికులు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నప్పుడు, కేంద్రంలోని ప్రధాన పార్టీలు విభజనకు అనుకూలంగా ఉన్నప్పుడు, రాష్ట్రం ఏర్పాటు ఉపద్రవం కానప్పుడు విభజన అనివార్యమని, విడిపోతే ఏపీకి ఏం కావాలో ప్రతిపాదించేందుకు .. విభజన తర్వాత పోలవరం సహా విభజన చట్టం, ప్రత్యేక హోదా హామీల అమలుకు తెలుగు తేజం, తెలుగు భవిత వంటి కార్యక్రమాల ద్వారా లోక్‌సత్తా తన వంతు ప్రయత్నం చేసింది. దీక్షలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, సభలు, కరపత్రాలు, ఇతర మార్గాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సమీకరించే ప్రయత్నం చేసింది. కానీ మా గొంతును వినపడనివ్వలేదు, వినిపించే అవకాశం వచ్చినచోట్ల చాలలేదు. వైకాపా, వామపక్షాలు, ప్రత్యేక హోదా సాధనా సమితి వంటి సంస్థలు, దీక్షలు, ప్రైవేటు బిల్లు వంటి రూపాల్లో కాంగ్రెస్ నేతలు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తదితరుల కృషి వల్ల ప్రత్యేకహోదా బలమైన డిమాండ్‌గా రూపుదిద్దుకుంది. కానీ లక్ష్యసాధన మార్గం పట్ల, ఐక్యపోరాటం పట్ల వారి పోరాటాల్లో స్పష్టత కొరవడుతోంది. చాలామందికి రాజకీయ లబ్ధి తప్ప ప్రజాప్రయోజనాలు పట్టటం లేదు. ప్రత్యేకహోదా ఇవ్వటానికి కొన్ని సమస్యలున్నాయని కేంద్రం అన్నప్పుడు, ప్రత్యామ్నాయాన్ని సూచించకుండా ఒకటే డిమాండ్ కోసం

పట్టుబడుతున్నారు. వెనకబడిన జిల్లాలకు ప్రత్యేకహోదా అన్న లోక్‌సత్తా ప్రత్యామ్నాయాన్ని కూడా వీళ్లు పట్టించుకోవటం లేదు. హోదాపై మాట తప్పినందుకు, ఎందుకు ఆ హామీని నెరవేర్చేలేకపోతున్నారో సరైన కారణాలు చూపలేనందుకు పాలక పక్షాల సంగతిని ప్రజలు వచ్చే ఎన్నికల్లో తేల్చుకుంటారు. కానీ మనకున్న పరిధిలో సరైన ప్రత్యామ్నాయాలతో ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం చేకూరేలా చేయటం మన కర్తవ్యమని ప్రతిపక్షాలు మర్చిపోకూడదు. హోదాపై పవన్ సభలకు లోక్‌సత్తా పూర్తి మద్దతునిస్తోంది. కానీ ఆయన సరైన పరిష్కారాల మీద దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు, పవన్ కళ్యాణ్ ఎక్కడ మైలేజీని కొట్టేస్తారోనన్న భయంతో వైకాపా నేత వైఎస్ జగన్ ఎత్తుగడలతో ఈ సమస్యపై ఆందోళనలు చేస్తున్నారు. పవన్ భాషలోనే మాట్లాడుతూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. చివరికి 2019 ఎన్నికలకు కూడా లోక్‌సత్తా నినాదమైన 'ప్రత్యేక హోదా'యే ఏపీకి ప్రధాన ఎజెండాగా మారేట్టు కనిపిస్తోంది. ఈ హామీని ఈ సరికే నెరవేర్చుకుని అభివృద్ధి, యువతకు ఉద్యోగాలతో ముందుకు దూసుకెళ్లాల్సిన నూతన ఆంధ్రప్రదేశ్ ఇంకా పాత డిమాండ్ చుట్టూనే తిరగాల్సి రావటం చాలా బాధాకరం. విడిపోతే మిగిలిన ఏపీకి వచ్చే ఆదాయ లోటుపై జనవరి 2014లో లోక్‌సత్తా బైటపెట్టిన లెక్కల్ని, ప్రతిపాదించిన ప్రత్యేక హోదాని పార్లమెంటు దాకా తీసుకెళ్లి ఫిబ్రవరిలో ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ నుంచి హామీని రాబట్టటంలో కొందరు కాంగ్రెస్ నేతలతోపాటు అభినందనీయ పాత్ర పోషించిన వెంకయ్యనాయుడికి ఇవన్నీ తెలియంకకాదు. కానీ ఆయన రాజకీయ చట్రంలో పరిమితమైపోయారు. ఇప్పుడు ఆయన వక్రీకరణలు చేయకుండా ఉంటే రాష్ట్రానికి ఎంతో మేలు చేసినట్టే.

ఇప్పుడు పన్ను రాయితీలు ఉన్న హోదా రాష్ట్రాలకు కూడా ఎత్తివేస్తున్నారు, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీకి ఎలా ఇస్తారు? అని అధికార పక్షం వారు అడ్డంగా వాదిస్తున్నారు. 'అయ్యా! ఇప్పటికే ఆ రాష్ట్రాలకు దాదాపు 16 ఏళ్ల మేర రాయితీలు లభించాయి. మనకి కూడా శాశ్వతంగా రాయితీలు ఇవ్వమని అడగటంలా. 15–20 ఏళ్లు మాత్రమే ఇవ్వమని అడుగుతున్నాం. అది కూడా ఇతర రాష్ట్రాల నుంచి పరిశ్రమలు తరలిరాకుండా, కొత్తగా పెట్టే పరిశ్రమలకు మాత్రమే ఇవ్వమని అడుగుతున్నాం. జయలలిత కూడా తమిళనాడుకు ఇబ్బంది లేకుండా ఏపీకి రాయితీలు ఇస్తే తమకు అభ్యంతరం లేదన్నట్టే లేఖ రాశారు.' దేశంలో ఎక్కడా లేని విధంగా అంటే, దక్షిణాదిన, ఆ మాటకొస్తే దక్కను ప్రాంతంలో ఒక్క రాష్ట్రానికైనా ప్రత్యేకహోదా ఇచ్చారా? కనీసం ఆ ప్రయోజనాల్ని అందించే ప్రయత్నం చేశారా? పెట్టుబడులపై పన్నులు వసూలు చేస్తున్నారుగానీ రాయితీలు ఇవ్వటం లేదు. 'దక్షిణాదివారికి ఇంతవరకూ హోదా లేదు కాబట్టి మనం ఇతర రాష్ట్రాలకు అభ్యంతరాలు లేనిరీతిలో అడగగలిగితే తప్పక సాధించుకునే అవకాశముందని' ఏపీలో ప్రత్యేకహోదా ప్రతిపాదన చేసినప్పుడు కూడా జేపీ సభలో చెప్పారు. అలాగే నీతి ఆయోగ్ ఏర్పడకముందు ప్రణాళికా సంఘం ఇంకా కొనసాగుతున్నప్పుడే లోక్‌సత్తా 'తెలుగు భవిత' కార్యక్రమం ద్వారా హోదా కోసం పోరాటం ప్రారంభించింది. అన్ని పార్టీలనూ కలుపుకుని కేంద్రంపై పోరాడాలని అధికార తెలుగుదేశాన్ని కోరింది. కానీ స్పందన లేదు. ఇప్పుడేమో ప్రణాళికా సంఘం లేదు, హోదా ఉన్న రాష్ట్రాలకే రాయితీలు ఎత్తేస్తున్నారు అంటూ కుంటిసాకులు చెబుతున్నారు. రెండున్నరేళ్లు అన్ని అవకాశాలనూ వదిలేస్తూ 'హోదా ఇదిగో వస్తోంది, అదిగో వస్తోంది అంటూ మభ్యపెట్టారు. ఇంతకాలం తాత్సారం తర్వాత.. హోదా సాధ్యం కాదు అని కేంద్రం చేత లీకులు ఇప్పించి ఇప్పుడు పన్ను రాయితీలు లేకుండానే హోదాను మించిన సాయం ఇచ్చారనటం పచ్చి దగా కాదా?

**80–100 వెనకబడిన జిల్లాలు, మెట్టప్రాంతాలకు పన్ను రాయితీలు కల్పించమని అడుగుదాం**

**నీతి ఆయోగ్, జీఎస్టీ జమానాలో కేంద్రానికి కూడా ఉపయోగపడే ప్రతిపాదన అవుతుంది**

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు గతంలో చేసినట్టు ఏపీ మొత్తానికీ ప్రత్యేక హోదా వంటి తప్పిదాలు చేయకుండా అప్రమత్తమై కలసికట్టుగా పకడ్బందీ వ్యూహాన్ని రూపొందించుకోవాలి. "పారిశ్రామిక రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా లేదా పేరు మార్చినా ఆ రాయితీలతో కూడిన సహాయాన్ని కేంద్రం చట్టబద్ధంగా అందించేలా చేయాలి. ఇందుకు రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా 80–100 వెనకబడిన జిల్లాలకు, మెట్ట ప్రాంతాలకు హోదా వంటి ప్రత్యామ్నాయాల్నీ కేంద్రానికి సూచించాలి. ప్రణాళికా సంఘం పోయి నీతి ఆయోగ్ వచ్చినా, జీఎస్టీ వచ్చినా వెనకబడిన ప్రాంతాలకు ఏదోకరూపంలో సాయం అవసరం కాబట్టి, ఇది కేంద్రానికి కూడా ఉపయోగపడే ప్రతిపాదనే అవుతుంది. కాబట్టి మనరాష్ట్ర పాలకులకు, ఎంపీలకు చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే కచ్చితంగా వెనకబడిన జిల్లాలకు రాయితీల ప్రతిపాదనపై కేంద్రాన్ని ఒప్పించి ఆచరణలోకి తేవచ్చు".

ఏపీకి 'ట్యాక్స్ ఫ్రీ' వెసులుబాటుని సాధించేలా అన్ని పార్టీలనూ, సంఘాలను కలుపుకుని ఈ డిమాండ్ సాధనకు సారథ్యం వహించటానికి చంద్రబాబు ముందుకొస్తే సరేసరి, లేదంటే ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపై ఇందుకు పోరాడాలి. ఇందులో లోక్‌సత్తా తన వంతు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది. జేపీ 2014లో పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైనట్టయితే, అసెంబ్లీలో చేసినట్టే పార్లమెంటులోనూ కృషి చేసి తెలుగు వారికి

రావలసినవన్నీ సాధించివుండేవారు. ఆ అవకాశం లేకపోవడం వల్లే ఈవేళ ఇన్నిసార్లు ఈ అంశం మీద అందరినీ బతిమిలాడుకోవాల్సి వస్తోంది. రౌతు ఓడు అయితే గుర్రం మూడు కాళ్లతో పరిగెడుతుంది, గాడిదలు గుర్రాల్లా భ్రమింపచేస్తుంటాయి. తమ ప్రయోజనాల కోసమైనా ప్రజలు రాజకీయాల్ని కొంత ఆలోచనతో పట్టించుకోవాలి. 14వ ఆర్థిక సంఘం సిఫార్సు, నీతి ఆయోగ్ ద్వారా కేంద్రం నుంచి పెరిగిన నిధులను తీసుకుంటూనే, పోలవరాన్ని వేగంగా పూర్తిచేసేలా పోరాడుతూనే "ప్రత్యేక తరగతి హోదా పారిశ్రామిక పన్ను రాయితీలు సాధించేందుకు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, వికేంద్రీకరణ, అవినీతి లేకుండా చట్టబద్ధపాలనతో అన్ని జిల్లాలూ అభివృద్ధి చెందేందుకు పోరాడే వారికే అండగా నిలవడం" ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజల ముందున్న సరైన కార్యాచరణ. ✦

## జేపీ, పవన్ కలసి పనిచేయాలని జనం కోరుకుంటున్నారు



లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కలసి పనిచేయాలని జనం కోరుకుంటున్నారని ఇరు పార్టీల నేతలూ అభిప్రాయపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రజాసమస్యలపై, రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కేంద్రంలోని పాలకులను నిలదీసేందుకు ఢిల్లీ దాకా వెళ్లి కృషి చేసిన లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీని జనసేన పార్టీ నేతలు విజయనగరంలో అభినందించారు. ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే బాబ్జీ కృషిని ప్రజలు గమనిస్తున్నారని, ఆయనకున్న చొరవ జిల్లాలో ఏ నేతకూ లేదని జనసేన నేత త్యాడ రామకృష్ణారావు (బాలు) అన్నారు. విభజన సమస్యల నేపథ్యంలో.. రాష్ట్రంలో, కేంద్రంలో జరుగుతున్న రాజకీయాలు జనహితంగా మారేందుకు జేపీతో పాటు వివిధ రంగాల ప్రముఖులతో జేఏసీ తరహా వేదికను ఏర్పాటు చేయాలని పవన్ ప్రయత్నించటం ఆహ్వానించదగ్గ పరిణామమని బాబ్జీ ఈ సందర్భంగా అన్నారు. హైదరాబాద్‌లో జేపీ, పవన్ మధ్య సమావేశాల వివరాలను ఆయన వివరించారు. ఈ వేదిక ద్వారా తెలుగు ప్రజలకు నిజమైన పరిష్కారాలు అందుతాయన్నారు. ఆర్భాటాలుకాకుండా ప్రజల సమస్యల్ని ఏ మేరకు పరిష్కరించామన్నదే నాయకత్వానికి కొలబద్దని అన్నారు. జనసేన ప్రతినిధులు రవిరాజ్, అభిలాష్, లోక్‌నాథ్ పట్నాయక్, రవితేజ, వెంకట్రావు, సతీష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పార్టీల నేతలనూ కదిలించాం

ఉత్తరాంధ్ర చర్చావేదిక తరపున మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జేపీ సూచన మేరకు చేసిన చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రధాన పార్టీల నేతలనూ కలిసి సమస్యలపై నిలదీశామని బాబ్జీ తెలిపారు. కేంద్రాన్ని ప్రశ్నించాలని కోరామన్నారు. ఇందుకోసం.. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో 13 రోజులపాటు ఢిల్లీలో ఉన్నామన్నారు. విజయనగరంలో జిల్లా నేతల సమావేశానుద్దేశించి ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక హోదా పారిశ్రామిక రాయితీలు, స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ మైనింగ్, విశాఖకు రైల్వే జోన్, సీమలో హైకోర్టు ఏర్పాటు చేసి విశాఖలో బెంచ్‌ని నెలకొల్పటం, విమ్స్‌ను ఎయిమ్స్ స్థాయిలో ఆధునీకరించటం తదితర డిమాండ్లను మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, వామపక్ష నేతలు డి.రాజా, సీతారాం యేచూరి, కేంద్ర మంత్రులు పీయుష్ గోయల్, రవిశంకర ప్రసాద్, నితిన్ గడ్కరీ, అశోక్ గజపతిరాజు, పార్లమెంటు సభ్యులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీలు కణితి విశ్వనాథం, జ్ఞానేశ్వరరెడ్డి, ఏసీపీ నేత రామానాయుడు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గన్నారన్నారు. విజయనగరం జిల్లా నుంచి ఆదాడ మోహన్, దప్పు శ్రీను, భాస్కర్, దేవిశ్రీ తదితర కళాకారులు పాల్గని ప్రజాసమస్యలపై గళం వినిపించారన్నారు. యువతకు అర్థమయ్యేలా కార్యక్రమాల జిల్లా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆకుల దామోదర్ తెలిపారు. అనంతరం బాబ్జీని నేతలు సత్కరించారు. లోక్‌సత్తా పార్టీ నేతలు కాండ్రేగుల ప్రసాద్, సత్యం మాష్టారు, రమణానందం, పాపారావు, రాయి పద్మ, సింహాచలం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సేవలు లేకుండా పన్నులు చట్టబద్ధ దోపిడీయే!



రాష్ట్రంలో, దేశంలో ప్రజల నుంచి పన్నుల్ని ఎంత స్మార్ట్‌గా వసూలు చేయాలో చర్చోపచర్చలు చేస్తున్నారుగానీ, ప్రజలు ఇప్పటికే కడుతున్న పన్నులకు తగ్గ సేవలను ఎందుకు అందించలేకపోతున్నామన్న ఆత్మపరిశీలన కరవైందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అన్నారు. పన్నులకు తగ్గ సేవలు లేనప్పుడు.. అసలు పన్నులు ఎందుకు కట్టాలి? అని ప్రశ్నించారు. పన్నులకు తగ్గ సేవల కోసం లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా.. పెద్ద నోట్ల రద్దు తర్వాత, జీఎస్టీ వచ్చాక ప్రజల్లో అవగాహన పెరిగిందని, దీన్ని కూడా అణగదొక్కేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు.


తణుకులో జేపీ మీడియాతో మాట్లాడుతూ, అధికార కేంద్రీకరణ వల్ల చాలా నష్టం జరుగుతుందని, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.15వేల కోట్ల మత్స్యసంపదను సృష్టిస్తున్నా, పన్నుల రూపంలో వేల కోట్లు కడుతున్నా రోడ్లు మాత్రం అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు. చైనాలాంటి నియంతృత్వ దేశంలో కూడా పరిస్థితి ఇంత దారుణంగా ఉండదన్నారు. అక్కడ నాయకులు, అధికారులు కలిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. స్థానిక నిర్ణయాలు స్థానికంగానే జరుగుతాయన్నారు. ఇక్కడ మాత్రం అంతా ప్రధాని, ముఖ్యమంత్రి, కలెక్టర్ చుట్టూ తిరుగుతుంటుందని, ఎమ్మెల్యేలు సామంతరాజుల్లా వ్యవహరిస్తారని, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రత్యేక రాయితీలున్న పౌరుల్లా వ్యవహరిస్తారని.. చివరికి ప్రజల్ని ద్వితీయ శ్రేణి పౌరుల్లా కొనసాగిస్తుంటారని అన్నారు.

సేవలు అందించకుండా పన్నులు వసూలు చేయటం అధికారిక దోపిడీ అవుతుందని జేపీ స్పష్టంచేశారు. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, ఓడతారు అనే విషయాల్ని తప్ప ప్రజలు పనికొచ్చే విషయాల గురించి, సేవ గురించి మాట్లాడేవారు కరవవుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీదా ఏటా రూ.60,000 ఖర్చు చేస్తున్నా మంచి చదువు రావటం లేదన్నారు. సరైన వైద్యం అందక రోజుకు దేశంలో 3,500మంది ఐదేళ్లలోపువారు మరణిస్తున్నారని, ఏటా 6కోట్ల మంది పేదరికంలోకి జారి పోతున్నారని అన్నారు. ప్రజలు ఇంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నా మనం విద్య, ఆరోగ్యం, హక్కుగా పౌరసేవలు అందించటాన్ని ప్రధానాంశాలుగా గుర్తించటానికి సిద్ధపడటం లేదన్నారు. ఎజెండా, చర్చ మారితేనే జనం జీవితాలు బాగుపడతాయన్నారు.

కేంద్రం నుంచి రాష్ట్రాలకు బడ్జెట్‌లో 51శాతం నిధులస్తున్నాయని, రాష్ట్రాల నుంచి స్థానిక ప్రభుత్వాలయిన పంచాయతీలు, మునిసిపాలిటీలకు నిధులెందుకు రావటం లేదని ప్రజలు ప్రశ్నించాలని జేపీ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలకు పౌర సేవల హక్కు చట్టం కోసం డిమాండ్ చేయాలన్నారు. వీటి కోసమే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ఒక్క ఆరోగ్య రంగాన్ని సంస్కరిస్తేనే 2 కోట్ల కొత్త ఉద్యోగాలు వస్తాయన్నారు. లోక్‌సత్తా కృషి వల్ల 3 రాజ్యాంగ సవరణలు, ఐదారు పెద్ద చట్టాలు, పలు విధానపరమైన మార్పులు వచ్చాయని, ఎటువంటి అధికారం లేకుండానే వీటిని సాధించామని జేపీ అన్నారు. అధికారంలో ఉన్నవారు కూడా సాధించని స్థాయిలో లోక్‌సత్తా విజయాల్ని సాధించిందని, సురాజ్య లక్ష్యాలను, ఆ తర్వాతి దశ సంస్కరణల్ని కూడా కాస్త ముందూ వెనకా సాధించి తీరుతామని అన్నారు. ప్రజల చైతన్యం, భాగస్వామ్యం ప్రజాస్వామ్య సంస్కరణలకు కీలకమన్నారు.

లోక్‌సత్తా నేతలు జి.జానకిరామరాజు, డాక్టర్ వంకా రామదాసు, సత్యనారాయణ, మాచిరాజు, ఎంఎస్‌కే చైతన్య, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✦

# ప్రజల పన్నుల డబ్బుకు 'పౌరసేవల్ని' ఎప్పుడు లింకు చేస్తారు?




**పౌరసేవల మెరుగుకా ! అవినీతి మేతకా**


'పాన్' కార్డుకి ఆధార్‌ని లింకు చేయండి, బ్యాంక్ అకౌంట్‌కీ, వాటికీ వీటికీ కూడా లింకు చేయండి అని ఊదరగొడుతున్న పాలకులు.. ప్రజల పన్నుల డబ్బుకు 'పౌరసేవల్ని' మాత్రం లింకు చేయలేకపోతున్నారు. ఆధార్ అనుసంధానానికి గడువు పెట్టి జనాన్ని భయపెడుతున్నారుగానీ, ప్రజలకు నిర్ణీత గడువులోగా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా పనులు చేసి పెట్టేందుకు పౌర సేవల (సర్వీస్ గ్యారంటీ) చట్టం వంటి ఏర్పాట్లను బిగించలేకపోతున్నారు. సరిహద్దుల్లో ఇతర దేశాలకు 56 అంగుళాల ఛాతీని చూపించటానికి సిద్ధపడుతున్న ప్రధాని.. దేశంలోపల సైన్యంలా పనిచేయాల్సిన ప్రభుత్వోద్యోగులను జవాబుదారీ చేయలేకపోతున్నారు. ఉద్యోగుల చేత సరిగ్గా పనిచేయిస్తూ అవినీతి, దేబిరింపులు లేకుండా ప్రజలకు సేవలందించే ఏర్పాట్లు లేకుండానే వారి జీతాల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకరెట్లు పెంచేస్తున్నాయి. దేశ జనాభాలో అత్యధికులు అసంఘటిత రంగంలోనే ఉంటే, పేదలుగానే కొనసాగుతుంటే, వారికి మరింత నాణ్యమైన సేవలు అందించాల్సిన ప్రభుత్వోద్యోగులలో ఎక్కువమంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నా, బ్యాంకుల దోపిడీలో భాగస్వాములవుతున్నా, జీతాలు పెంచుతుంటే.. ఇక్కడ నేరస్తులు ఎవరు?... సేవల పట్ల అసంతృప్తితో పన్నులు ఎగ్గొట్టేవారా లేక సేవలు ఎగ్గొట్టే సర్కారీ పాలనావ్యవస్థా? ఎవరికి శిక్ష పడాలి? ఎవరు మారాలి? ప్రజలు పన్నులు కడుతున్నది ప్రభుత్వోద్యోగుల జీతాలకు, సర్కారీ సోకులకా లేక తమకు సేవలందించడానికా? మన ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వాలు సరిగా పనిచేస్తే చైనా, అమెరికాలు భారత్‌ను తేరిపార చూడగలవా?

'తమ పన్నుల డబ్బుకి- తమ ఓటుకి' మధ్య సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకుంటే తమ నిజమైన ప్రయోజనాలను, వాటిని సాధించగలిగిన విధానాలున్న నాయకుల్ని, పార్టీలను ఎన్నుకుంటారని దేశంలోనే కొత్త రాజకీయ ఉద్యమానికి నాంది పలికింది లోక్‌సత్తా. ఆ భాష అప్పట్లో చాలామందికి వింతగా అనిపించింది. లోక్‌సత్తా ఓ పార్టీగా కూడా విస్తరించినప్పుడు .. "మీ భాష ప్రజలకు అర్థం కావటం లేదండీ, ఇలాగైతే గెలవరుగానీ పంథా మార్చుకుని మిగతా పార్టీల్లాగా కాస్త.." అని శ్రేయోభిలాషులు సలహా ఇస్తుండేవారు. కానీ 2016 నవంబర్ 8న పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) తర్వాతి పరిణామాలు, జీఎస్టీ జమానా.. లోక్‌సత్తా చెప్పిన 'పన్నుల చుట్టూ రాజకీయాన్ని' పట్టించుకోవటం జీవితాల్ని బాగుచేసుకోవడానికి ఎంత అవసరమో ప్రజలకు ముంజేతి కంకణాల్లా తెలియచెబుతున్నాయి.

ఆన్‌లైన్ లావాదేవీలు, ప్రతి దానికీ వివరాలు, ఆధార్ అంటూ పన్ను ఆదాయాన్ని కొన్ని రెట్లు పెంచుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తు చాలామంది పేదలను చికాకు పరుస్తోంది. మధ్యతరగతివారి కలల్ని నీరుగారుస్తోంది. ఓ చిన్నపాటి ఇల్లు కొనుక్కోవటానికో, ఇతరత్రా అవసరానికో నాలుగైదు 'ల'కారాల డబ్బును కూడా క్యాష్ రూపంలో సర్దుబాటు చేయటానికి పెద్దగా ఎవరూ ముందుకు రాకపోవటం, బ్యాంకుల్లో, కొనుగోళ్లలో పన్నుల బాదుడు పెరగడం అసహనాన్ని పెంచుతోంది. డబ్బున్నవాళ్లని దెబ్బకొట్టాడు మోదీ.. భలే భలే.. అని సంబరపడ్డవాళ్లకి కూడా క్రమంగా సెగ తగులుతోంది.

తెలుగునాట అవేవో జిల్లాల్లో ఒక సమూహం లోని అత్తాకోడళ్లు చాలా మర్యాదగా తిట్టుకుంటారట.

రాయటానికి వీల్లేని భాషలోని తిట్లను కూడా అంతే మర్యాదగా ఉపయోగించు కుంటారట. 'మీరు వట్టి పనికిమాలినవాళ్లు అత్తయ్య గారూ' అంటూ కోడలు మర్యాదాపూర్వకంగా తిట్లు మొదలుపెడుతుంది. అత్త కూడా తిట్టదలచుకుంటే అదేతీరుగా మర్యాదగా దాడిచేస్తుంది. ఆ తరహాలోనే మోదీ ఈ దేశ ప్రజలకు 'మీరు నిజాయతీపరులు కారు, పన్నులు ఎగ్గొట్టే దొంగలు, దేశ ఖజానాకు చేరాల్సిన డబ్బును దోచేసుకుని దాచేసుకుంటున్నవాళ్లు' అని చాలా మర్యాదగా డీమానిటైజేషన్ తర్వాత ఆన్‌లైన్ లావాదేవీలు, లింకుల పేరుతో చాటిచెప్పారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) చట్టం కూడా వచ్చేయటంతో




ప్రజలకు పన్ను నొప్పి గురించి అవగాహన మరింత పెరిగింది. 'పాఠాలు సరిగా చెప్పలేని పంతులు బెత్తం ఎక్కువగా ఉపయోగిస్తాడు, మోదీ మరీ 19వ శతాబ్దపు ఛాదస్తపు నాయకుడిలా వ్యవహరిస్తున్నారు' అని లోపల నుంచి సణుగుడు వినిపిస్తున్నా చేసేదేమీ లేదు. 'పన్నుల'కు దొరకుండా మధ్య సందులో రుచుల్ని ఆస్వాదించే నాలుకలా వ్యవహరించే చురుకుదనాన్ని పెంచుకోవటం తప్ప బతకటానికి వేరే మార్గమేమీ లేదు.

అన్నట్టు, ఇక్కడే ఒక విషయాన్ని ప్రస్తావించాలి. విషయమంటే.. ఓ స్వీయానుభవం! ఈ వ్యాసరచయిత డీమానిటైజేషన్‌కి ముందు ఏదో ఒక పని నిమిత్తం ఒక ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాడు. సర్కారీ ఉద్యోగమే చేస్తున్న ఒక తెలిసిన పెద్దాయన అక్కడ ఓ బ్రోకర్‌ని పరిచయం చేశాడు. తర్వాత బ్రోకర్‌తో ఏకాంతంగా ఏదో మాట్లాడి వచ్చాడు. 'కొంత అమౌంట్ కట్టాలట' అన్నాడు. 'ఓహో' అన్నాను. 'మీరు లోక్‌సత్తాతో పనిచేస్తుంటారు గదా. లంచాలివ్వటం మీ విధానాలకు విరుద్ధం కదా. లోక్‌సత్తా జేపీ అవినీతిని సహించరు కదా. మరేం చేద్దాం?' అన్నారాయన. 'నేను లంచం తీసుకోను. అవినీతి లేని సమాజాన్ని నిర్మించే వ్యవస్థ కోసం నూరుశాతం నిజాయతీగా పనిచేస్తాను. కానీ నా అవసరానికి ఎదుటివాడు లంచం అడిగితే, అది చట్టవిరుద్ధమే అయినా ఇవ్వటానికి నేనేమీ సిగ్గుపడను. గతిలేక ఇచ్చే ఈ లంచానికి.. లోక్‌సత్తా భావజాలంగానీ, జేపీగానీ ఇందుకు అభ్యంతర పెడతారని నేననుకోవటం లేదు. సమస్య నాది కాదు.. ఆ బ్రోకర్‌ది. ఇంకా చెప్పాలంటే ఈ సమాజానిది. లోక్‌సత్తా చెబుతున్న 'పౌర సేవల' చట్టం వంటివి వినీ వినీ అయినా ప్రజలు ముందుకొస్తే చేతల్లో చూపితే.. అందరికీ సంతోషం కలిగించే సమాజం ఏర్పడుతుంది" అన్నాను.

బ్రోకర్‌కి డబ్బులిచ్చేశాను. ఆ పెద్దాయన కూడా మాట్లాడకుండా పనిచేయించి పెట్టాడు.

ఆ తర్వాత వస్తున్నప్పుడు "నేను త్వరలో రిటైర్ కాబోతున్నాను. అందులో కొంతడబ్బు పెట్టి మా స్వగ్రామంలో గాంధీ గారి విగ్రహం పెడదామను కుంటున్నాను. ఓ మంచిపని చేసిన తృప్తి కలుగుతుంది" అన్నాడాయన. 'మంచిదే సార్'. 'గాంధీ అవసరం ఇంకా చాలాకాలంపాటు ఈ దేశానికి ఉంది' అన్నాను.

'విగ్రహానికి నేను నాలుగైదు లక్షలు ఖర్చు పెడుతున్నాను. మా మిత్రులంతా తలా రూ.10వేలు ఇస్తున్నారు' అన్నాడాయన. 'చాలా సంతోషం సార్' అన్నాను. 'ఆ తర్వాత మా ఊరి గుడిగోపురం కూడా బాగుచేయిస్తాను' అని చెప్పాడు.

'గాంధీ కోరుకునే పనిని, గుళ్లో దేవుడు ఆశిస్తున్న లక్ష్యాన్ని నేను లోక్‌సత్తా ద్వారానే చేస్తున్నాను సార్. విగ్రహాలతోపాటు కాస్త ఇలాంటి పనుల మీద కూడా దృష్టి పెట్టండి" అన్నాను.


నేను డొనేషన్ ఇవ్వాలనుకున్నా, విగ్రహాలకఏర్పాటు వంటి వాటికి ఇవ్వనని ఆయనకు అర్థమైంది. 'మేం మారటానికి ఇంకా టైం కావాలోయ్' అన్నట్టు నావంక చూశారని పించింది.

తప్పనిసరి పరిస్థితుల్లో లంచాలివ్వడమేకాదు, కొన్ని సందర్భాల్లో పన్నులు ఎగ్గొట్టటానికి కూడా ఈ రచయిత సిద్ధపడ్డాడు. దీని గురించి కూడా ఇక్కడ చెప్పుకోవాలి.

జీఎస్టీ జమానా వచ్చాక, పన్నుల ఉచ్చును మోదీ ప్రభుత్వం పకడ్బందీగా బిగించాక, మోదీ ఎక్కడా అవినీతికి పాల్పడలేదని ఇప్పటివరకూ ఉన్న సాక్ష్యాలు చెబుతున్నా కూడా.. వీలైనంతగా పన్నుల్ని ఎగ్గొట్టాలనే ఈ రచయిత భావిస్తున్నాడు. ఎందుకంటే, నేను కట్టే పన్నులకు తగ్గ సేవలు అందటం లేదు. నా డబ్బుల్ని అవినీతిపరులు దోచేస్తున్నా.. సరైన అవినీతి వ్యతిరేక వ్యవస్థల్ని ఏర్పాటు చేయటం లేదు.

డీమానిటైజేషన్ తర్వాత నగదు రహితంగా ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తుండటం వల్ల పన్ను పరిధి పెరిగి ప్రభుత్వానికి ఆదాయం ఐదారు రెట్లు పెరుగుతాయంటున్నారు. మనం పన్నులు కడుతున్నది మనం ఎన్నుకున్నవారికే కాబట్టి, మన ప్రభుత్వానికి రాబడి పెరిగితే మనకు సంతోషమే. కానీ ఇప్పటివరకూ కట్టించు కుంటున్న పన్నులకు ప్రభుత్వం ఏం చేస్తోంది? బైటికెళ్తే సెక్యూరిటీ ఉండదు, మంచినీరు శుభ్రంగా అందదు, రోడ్లు అధ్వాన్నం, చెత్తకుప్పలు పేరుకుపోయి ఉంటాయి, కల్తీ లేని తిండి ఉండదు, ఆసుపత్రికి వెళ్తే దిక్కుండదు, మంచి చదువు, ఆరోగ్యం కావాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిందే, దయదలిచినట్టు చేసే సర్వీసులకు కూడా లంచాలు సమర్పించుకోవాల్సి ఉంటుంది.. ఇలా ప్రజల్ని వేధిస్తున్నవారు అందరినీ పన్నులు కట్టమంటే ఎలా? ఎందుకు కట్టాలి పన్నులు?”

‘పాన్’ కార్డుకి ఆధార్‌ని లింకు చేయండి, బ్యాంక్ అకౌంట్‌కీ, వాటికీ వీటికీ కూడా లింకు చేయండి అని ఊదరగొడుతున్న పాలకులు.. ప్రజల పన్నుల డబ్బుకు ‘పౌరసేవల్ని’ మాత్రం లింకు చేయలేకపోతున్నారు. ఆధార్ అనుసంధానానికి గడువు పెట్టి జనాన్ని భయపెడుతున్నారుగానీ, ప్రజలకు నిర్ణీత గడువులోగా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా పనులు చేసి పెట్టేందుకు పౌర సేవల (సర్వీస్ గ్యారంటీ) చట్టం వంటి






*మేం 30.9శాతం ఆదాయపు పన్ను కడుతున్నాం. ఏ వస్తువు కొన్నా 18 శాతం జీఎస్‌టీ కడుతున్నాం. ఇప్పుడు వేలకోట్లతో నీరవ్‌మోదీ పారిపోయాడు. మేం ఎందుకు పన్ను చెల్లించాలి? వాటిని ఎలాగో మళ్లీ ఎవరోకరు దోచుకొని పారిపోతారేమో కదా.*

**– రిచా చద్దా, బాలీవుడ్ నటి**

ఏర్పాట్లను బిగించలేక పోతున్నారు. సరిహద్దుల్లో ఇతర దేశాలకు 56 అంగుళాల ఛాతీని చూపించటానికి సిద్ధపడుతున్న ప్రధాని.. దేశంలోపల సైన్యంలా పనిచేయాల్సిన ప్రభుత్వోద్యోగులను జవాబుదారీ చేయలేకపోతున్నారు. ఉద్యోగుల చేత సరిగ్గా పనిచేయిస్తూ అవినీతి, దేబిరింపులు లేకుండా ప్రజలకు సేవలందించే ఏర్పాట్లు లేకుండానే వారి జీతాల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకరెట్లు పెంచేస్తున్నాయి. దేశ జనాభాలో అత్యధికులు అసంఘటిత రంగంలోనే ఉంటే, పేదలుగానే కొనసాగుతుంటే, వారికి మరింత నాణ్యమైన సేవలు అందించాల్సిన ప్రభుత్వోద్యోగులలో ఎక్కువమంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నా, బ్యాంకుల దోపిడీలో భాగస్వాములవుతున్నా, జీతాలు పెంచుతుంటే.. ఇక్కడ నేరస్తులు ఎవరు?... సేవల పట్ల అసంతృప్తితో పన్నులు ఎగ్గొట్టేవారా లేక సేవలు ఎగ్గొట్టే సర్కారీ పాలనావ్యవస్థా? ఎవరికి శిక్ష పడాలి? ఎవరు మారాలి? ప్రజలు పన్నులు కడుతున్నది ప్రభుత్వోద్యోగుల జీతాలకు, సర్కారీ సోకులకా లేక తమకు సేవలందించడానికా? మన ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వాలు సరిగా పనిచేస్తే చైనా, అమెరికాలు భారత్‌ను తేరిపార చూడగలవా?

ప్రభుత్వ సేవల పట్ల అసంతృప్తితో నేను ‘కొన్నిరకాల పన్నుల్ని’ ఎగ్గొట్టాలను కుంటున్నాను (దేశంలో ఎన్ని లోపాలున్నా.. మొత్తం పన్నులు

## ఇవి చేస్తేనే.. స్వచ్ఛందంగా పన్నులు కడతామని చాటిచెబుదాం!

మనమంతా కచ్చితంగా పన్నులు, పన్నులకు తగ్గ సేవల చుట్టూ మన రాజకీయ ఆలోచనల్ని, భాగస్వామ్యాన్ని తిప్పాలి. తక్షణం ఈ సంస్కరణలకి డిమాండ్ చేయాలి. అప్పుడే పన్నులు ఎగ్గొట్టే ఆలోచనలు చేయకుండా స్వచ్ఛందంగా కడతామని ప్రభుత్వాలకు తెలియచెప్పాలి..

- పన్నుల పరిధి పెరిగి రాబడి బాగా పెరుగుతుంది కాబట్టి ముందు పన్నుల్ని తగ్గించాలి
- పన్నులకు తగ్గ సేవలు అందించేందుకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో.. పనుల్ని, ప్రమాణాల్ని, ఎంత సమయంలోగా ప్రజలకు ఆ పని చేసిపెడారో గడువుని చెబుతూ సిటిజన్ ఛార్టర్లను ప్రదర్శించాలి. కేవలం బోర్డులు పెట్టటమే కాదు, చట్టబద్ధంగా ఆ గడువులోగా అమలుచేయాలి, చేయకపోతే రోజుకు కనీసం రూ.250 పరిహారం ప్రజలకు చెల్లించేలా 'పౌరసేవల చట్టం' (సర్వీస్ గ్యారంటీ)ని తీసుకురావాలి.
- స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో కూడిన అధికారాల్ని, నిధుల్ని ఇవ్వాలి
- రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రక్షాళన చేసి నగదు లావాదేవీలు లేకుండా చేయాలి. స్టాంప్ డ్యూటీని, ఇతరత్రా పన్నుల్ని తగ్గించి భూమి విలువను మార్కెట్ రేటుతో దాదాపు సమానంగా పెంచాలి.
- పన్నుల డబ్బును తాయిలాలకు పందేరం చేయకుండా ప్రజలకు నిజమైన అభివృద్ధిని, స్వతంత్ర జీవనాన్ని అందించే విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక వసతులు, ఆవిష్కరణలకే కేటాయించాలి. పన్నుల డబ్బుకు తగ్గ సేవలు సంతృప్తికరంగా అందుతున్నాయని ప్రజల నుంచి సంకేతం వచ్చాకే మరిన్ని సేవలకు ప్రజలు స్వచ్ఛందంగా ఎక్కువ పన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలి.
- కనీసం డీమానిటైజేషన్ తర్వాతైనా మోదీ అవినీతిపరులపై, నల్లధనం రాజకీయంపై కఠిన చర్యలు తీసుకునే సాహసం చేయాలి. అవినీతి నిరోధక చట్టంలో లంచగొండులకే రక్షణ కల్పించే తప్పుడు సవరణల్ని తొలగించి, ఆస్తుల జప్తు వంటి ఏర్పాట్లతో పటిష్టం చేయాలి.
- ఎన్నికలలో డబ్బు ప్రభావాన్ని తగ్గించేందుకు దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణల్ని కూడా తేవాలి.

వీటన్నిటితో హేతుబద్ధ పన్నులు – పన్నుల డబ్బు సద్వినియోగం వ్యవస్థలో భాగంగా మారిపోతాయి, ప్రజలు పడ్డ నోట్ల కష్టాలకు సరైన ఫలితం దక్కుతుంది. ఈ పన్ను సంస్కరణల్ని వెంటనే సాధించుకోవటంతోపాటు.. 'పన్నులు మావి.. సేవలు మాకే, నో సర్వీసెస్ – నో ట్యాక్స్' అంటూ కొన్ని సందర్భాల్లో 'తాత్కాలిక' సహాయ నిరాకరణ ఉద్యమాలు చేసైనా పన్నులకు తగ్గ సేవల్ని నిరంతరం పొందుతుండాలి.

ఎగ్గొట్టాలని భావించను, ప్రజలంతా పన్నుల్ని ఎగ్గొట్టాలని ప్రతిపాదించను. అలాగే ఎవరైనా నాలాగా గతిలేక పన్నుల్ని ఎగ్గొట్టేందుకు ప్రయత్నించినా ఖండించను, నేరంగా భావించను). ఇందుకు నాకు శిక్ష పడినా బాధ లేదు. ప్రమాణం చేయకపోయినా రాజ్యాంగ బాధ్యతల్ని గౌరవించే పౌరుడిని కాబట్టి.. ఆ శిక్షకు సిద్ధమే. ఈ అంశం మీద కొంత చర్చకయినా అది ఉపయోగపడుతుంది.

ఈ రచయితలాగే పన్నులకు తగ్గ సేవలు లేకుండా పన్నులు ఎందుకు కట్టాలి? అని ఆలోచించే మిత్రులు అనేకమంది ఉన్నారు. ఇలా ఆలోచించే ఓ లోక్‌సత్తా నేత ఇటీవల ఫోన్ చేసి.. 'లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతున్న 'ప్రజల పన్నుల డబ్బుకు తగ్గ సేవల' రాజకీయం గురించి చెప్పటానికి ఇప్పుడు కాస్త మెరుగైన వాతావరణం ఉంది. జీఎస్టీ వచ్చాక ప్రజలకు పన్నుల గురించిన చైతన్యం పెరిగింది. డీమానిటైజేషన్ సమయంలో 'లోక్‌సత్తా టైమ్స్' (2016 సంచికల్లో) ప్రచురించిన 'పన్నులు మావి, సేవలు మాకే.. నో సర్వీసెస్ – నో ట్యాక్స్' (ఊపందుకోవాలీ 'ట్యాక్స్‌మనీ రాజకీయం') ఆర్టికల్, ఇతర వ్యాసాల్లోని అంశాల్ని తిరిగి ప్రచురించండి' అని కోరారు.

సో.. 'వన్స్‌మోర్'!

ఇలా ఎన్నిసార్లయినా చెప్పాల్సిందే. ఎందుకంటే, తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి అన్నట్టు.. 'నువ్వు ఆచరించనంత వరకూ నీకు ఆ విషయం తెలియనట్టే'. కాబట్టి

ఇలాంటి విషయాల్ని మళ్లీ మళ్లీ చెప్పటం ఎంతమాత్రం బోర్ కాదు.

'పన్నులు మావి, సేవలు మాకే' ఐటంలోని కొన్ని భాగాలను ఇన్‌సెట్ బాక్సుగా, ఇతర చోట్లా ఈ వ్యాసంలో కలిపాం. 'మోదీ గారూ, నేను ట్యాక్స్ ఎందుకు ఎగ్గొట్టానంటే..?' శీర్షికతో ప్రచురించిన లేఖను మాత్రం యథాతథంగా దిగువన ప్రచురిస్తున్నాం. లోక్‌సత్తా భావజాలం, హేతుబద్ధత వంటి ప్రమాణాల పట్ల అవగాహన, కార్యక్రమాల్లో భాగస్వామ్యం ఉన్న నేపథ్యంలో శిరమణి నరేష్ ఈ లేఖను రాశారు. ఆయన ఎడిటర్‌గా ఉన్న 'కొరడా డాట్‌కామ్'లో తొలుత ప్రచురితమై ఆ తర్వాత వైరల్‌గా షేర్ అయిందిది. వాస్తవానికి ఈ లేఖలో ఉన్న ఆదాయం, ఆ రకంగా పన్ను చెల్లించాల్సిన అవసరం ఈ దేశంలో అత్యధికులకు లేకున్నా.. సబ్బుబిళ్లకు, అగ్గిపెట్టెకు కూడా మనందరం చెల్లించే పన్నులు, వాటికి తగ్గ సేవలను సాధించుకునేలా చైతన్యాన్ని పెంచుకోవటానికి ఈ లేఖ ఉపయోగపడుతుంది..




**ప్రజల పన్నులు... వారి ఇళ్ల కోసమే పనులు!**

**సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని అంబేద్కర్‌నగర్‌లో 400 రెండు పడకల గదుల ఇళ్లను నిర్మించనున్నారు. అందులో భాగంగా పనులు కొనసాగుతున్నాయి. అక్కడ 'ప్రజల పన్నులతో పనులు' అంటూ వివరాలతో కూడిన బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. అందులో పనుల కారణంగా కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నామంటూ రాయడం ఆకట్టుకుంటోంది.**

# మోదీ గారూ, నేను ట్యాక్స్ ఎందుకు ఎగ్గొట్టానంటే..?

## (ఎన్నో ఏళ్లుగా లోక్‌సత్తా చెబుతున్న మాట - నేడు సోషల్ మీడియాలో వైరల్ బాట)

**ప్రియమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీగారు,**

**నమస్కారం.**

నా పేరు ప్రసాద్. హైదరాబాద్‌లోని బాలానగర్‌లో చిన్న ఇండస్ట్రీ నడుపుతాను. నెలకి 2లక్షల దాకా ఆదాయం వస్తుంది. అంటే, ఏడాదికి 24 లక్షలు. నిజాయితీగా అయితే ఏడాదికి కనీసం 3లక్షలు (మినహాయింపులు అన్నీ పోను) ఆదాయపు పన్ను కట్టాలి. అయితే నేను జస్ట్ 30వేలు మాత్రమే పన్ను కడతాను.. ఎందుకంటే?

నేను మామూలు మధ్యతరగతి ఫ్యామిలీలో పుట్టా. కష్టపడి చదువుకుని కొన్నాళ్లు ఉద్యోగం చేసి, పైసా పైసా కూడబెట్టి ఇప్పుడు సొంత ఇండస్ట్రీ పెట్టుకునే దశకు చేరుకున్నాను. నా సంపాదన రెండు లక్షల్లో, ఒక లక్ష నా కుటుంబ అవసరాలకి సరిపోతుంది. మిగతా లక్ష భూములు, బంగారం లాంటి వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తాను. నేను ఖర్చు పెట్టే లక్ష రూపాయల్లో దాదాపు 30వేలు పరోక్ష పన్నుల రూపంలో ప్రభుత్వం రాబట్టుకుంటోంది. కిరాణా సరకుల దగ్గర్నుంచి టీవీ, మొబైల్ దాకా ఏది కొన్నా 20 నుంచి 30శాతం పన్ను. ఇక ఫ్రెండ్స్‌తో పార్టీ చేసుకుంటే 3,000 ఖర్చు అయితే, దాదాపు 60శాతం ప్రభుత్వానికి పన్ను. కారుకి పెట్రోల్ కొట్టిస్తే లీటరుకి రూ.30 పన్ను. కారు కొంటే అన్ని ట్యాక్సులూ కలిపి ప్రభుత్వానికి లక్షన్నర చెల్లించా. ఇంటి స్థలం కొంటే లక్ష రూపాయలు రిజిస్ట్రేషన్ కోసం కట్టా. ప్రభుత్వం కనీసం మట్టిరోడ్డు కూడా వేయని మా కాలనీలో స్థలం కొన్నందుకు ప్రభుత్వం డెవలప్‌మెంట్ ఛార్జీల పేరుతో రూ.50వేలు వసూలు చేసింది. ప్రభుత్వ ఆసుపత్రులు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో చూశాక, తప్పదని హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే, సిగ్గు కూడా లేకుండా ప్రభుత్వం దాని మీద సర్వీస్ ట్యాక్స్ వేసింది. దారిదోపిడీ దొంగలు దోచుకున్నట్టు.. ప్రతి దాని మీద ఆఖరికి శ్మశానంలో శవదహనం మీద కూడా పన్నులేస్తున్న ప్రభుత్వం మాకు తిరిగి ఏమిస్తోంది?

గవర్నమెంట్ స్కూళ్లలో మా పిల్లల్ని చేర్పిస్తే చదువు వస్తుందనే నమ్మకం ఉందా? గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్తే ఆరోగ్యంతో తిరిగి వస్తామనే నమ్మకం ఉందా? దేశ రక్షణ, రోడ్లు వేయటం తప్ప, చేస్తున్న అభివృద్ధి పనులేమిటో మాకు అర్థం కావటం లేదు. కారు కొంటే రోడ్ ట్యాక్స్, రోడ్డెక్కితే టోల్ ట్యాక్స్.. తోలు తీస్తున్నారు కదా సార్. ఇక మా పన్నుల డబ్బు ఏమైపోతోంది? మా ఇండస్ట్రీలో పనిచేసే వారికి జీతం పెంచాలి అంటే.. వారు ఎంత పనిచేస్తారు? ఎలా పనిచేస్తారు? అని ప్రతి ఏడూ చూసి ఇంక్రిమెంట్ ఇస్తాం. కానీ ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? ఉద్యోగి పనిచేసినా చేయకపోయినా, అధ్వాన్నంగా చేసినా, అందరికీ ఒకే జీతం, ఒకే ఇంక్రిమెంట్.. మా సొమ్మంటే అంత లోకువా? పైగా మా పన్నుల డబ్బుతో జీతాలు తీసుకుంటూ, మా పనులు చేయాలంటే, ఫోజులు కొడతారు. 10 గంటలకి ఆఫీసు అంటే 11 గంటలకి వస్తారు. లంచం లేకుండా ఒక్క పని కూడా చేయరు. మరి ఎందుకు సార్, మేము ప్రభుత్వానికి పన్నులు కట్టాలి. ఇండస్ట్రీ నడవాలి అంటే, కరెంటు వాళ్లతో మొదలుపెట్టి అందరికీ లంచాలు ఇవ్వాలి. అందరికీ కలిపి నెలకి సుమారు 10వేలు లంచాలు ఇవ్వాల్సి వస్తోంది. ఆ లంచాలన్నీ వైట్‌లో చూపించటం ఎలా సార్? అందుకే సార్, మాకు ప్రభుత్వాలకి పన్ను కట్టాలంటే కడుపు మండిపోద్ది. అలాగని నేను సామాజిక బాధ్యత లేనివాణ్ణి కాదు సర్. మీరు సైనిక నిధికి విరాళం ఇవ్వమంటే 10వేలు ఇచ్చా. మా దగ్గరలో ఉన్న అనాథాశ్రమానికి ఏడాదికి 20వేలు ఇస్తా. మా ఊర్లో స్కూలు బాగుచేస్తామంటే మా నాన్న పేరు మీద లక్ష డొనేషన్ ఇచ్చా. కానీ ప్రభుత్వానికి పన్ను కట్టాలంటే మాత్రం నాకు మనసొప్పదు సార్.

ఓకే.. ఇదంతా గతం. ఇప్పుడు అంతా వైట్ మనీలోనే వ్యవహారాలు చేద్దాం. మీరు డిసైడ్ చేశారు కాబట్టి, నా దగ్గర వున్న 10లక్షల బ్లాక్ మనీకి 30శాతం అంటే 3 లక్షలు కట్టి, మొత్తం వైట్‌లోకి మార్చుకుంటా. కానీ, నేను రేపటి నుంచి నెలకి 10వేలు లంచాలు ఇవ్వకుండా పనులు అవుతాయనే గ్యారంటీ ఇస్తారా? లేదా లంచాన్ని చెక్ రూపంలో తీసుకొమ్మని ఉద్యోగులకి పర్మిషన్ ఇస్తారా? ఇక నాయకుల సంగతి చెప్పలేదు కదా.. మా గల్లీ లీడర్ దగ్గర్నుంచి, ఎమ్మెల్యే దాకా అందరి ఎలక్షన్లకి, అన్ని పార్టీలవారికీ విరాళాలు ఇవ్వాలి. లేకపోతే ఇబ్బంది పెడతారు. వీళ్లని కూడా విరాళాలు చెక్కుల రూపంలో తీసుకొమ్మని చట్టం చేస్తారా? పార్టీల డబ్బుల లెక్కల్ని రహస్యం లేకుండా ఓపెన్‌గా చెబుతారా? ఇప్పటికే బోలెడు పన్నులు కడుతున్న మేము పన్నులు కట్టం సర్. వీలైనంత ఎగ్గొడతాం. పదేళ్లకి మళ్లీ దేశంలో బ్లాక్‌మనీ పెరిగిపోతుంది. అప్పుడు మళ్లీ నోట్ల మార్పిడి తెస్తారా? ఇందుకు కాదు సర్, మిమ్మల్ని ఎన్నుకుంది. మీ నిర్ణయం వల్ల రెండు రోజులుగా చేతిలో డబ్బు లేక ఇబ్బందిపడుతున్న మా వర్కర్స్ కూడా, మీ మీద నమ్మకంతో ఈ ఇబ్బందిని సంతోషంగా భరిస్తున్నారు సార్. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోండి. ముందు మేము కడుతున్న పన్నులకి న్యాయం చేయండి. అప్పుడు మేము కూడా న్యాయంగా పన్నులు కడతాం. రెండు చేతులూ కలిస్తేనే సర్ చప్పట్లు. మా చెయ్యి రెడీ. మీ చేత కోసం ఎదురుచూస్తుంటాం.

ఇట్లు
మీ
అభిమాని, ఓటరు ✦

## FORM IV


1. Place of Publication : Hyderabad

2. Periodicity of its publication : Fortnightly

3. Printer's Name : Dr. Jaya Prakash Narayan
Nationality : Indian
Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)

4. Publisher's Name : Dr. Jaya Prakash Narayan
Nationality : Indian
Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)

5. Editor's Name : Dr. Jaya Prakash Narayan
Nationality : Indian
Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)

6. Name and address of individual who own the news paper : Dr. Jaya Prakash Narayan
Indian
Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)

and partners or shareholders holding More than one per cent of the total capital NA

I, Dr. Jaya Prakash Narayan hereby declare that the particulars given above are true to the best of my knownledge and belief

Date : 01 March 2018

(Sd) (Jaya Prakash Narayan)
Signature of the Publisher

# ఓటు ఒక్కరోజే - పన్నులు ప్రతిరోజూ

- సత్యనారాయణ .వి

- ఐదేళ్లకోసారి వేసే ఓటు కోసం - ప్రతిరోజూ రాజకీయాలే మాట్లాడుతున్నాం
- ప్రతిరోజూ మనం కట్టే పన్నుల డబ్బు గురించి- ఒక్కరోజైనా మాట్లాడుతున్నామా?

## ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్
## మన పన్నుల డబ్బు మన పనుల కోసం

ఏంటీ టూత్ పేస్ట్ ధర పెరిగింది.. జీఎస్టీ సార్
నాలుగు ఇడ్లీ, ఒక దోసెకే ఇంత బిల్లు అయిందేంటి.. జీఎస్టీ సార్
సినిమా టికెట్ వందే కదా 118కి ఎప్పుడు పెంచారు.. జీఎస్టీ సార్
ఫ్లాట్ బాగుంది.. స్క్వేర్ ఫీట్ ఎంత.. జీఎస్టీ రాకముందు 3000 ఉండేది ఇప్పుడు 3200

ఇలా ఒక్కటేంటి.. బెడ్ కాఫీ నుంచి బెడ్ లైట్ దాకా అన్నిటికీ జీఎస్టీ.. పుట్టిన దగ్గర్నుంచి పోయే దాకా మనం ఉపయోగించే ప్రతి వస్తువు మీద, ప్రతి సేవ మీదా మనం ప్రభుత్వాలకి పన్నులు కడుతున్నాం.. ఇన్ని పన్నులు కట్టే మనకి ప్రభుత్వాలు ఎన్నో సేవలు చేయాలి కదా.. కానీ చేస్తున్నాయా?


పిల్లల చదువు కావాలంటే ప్రైవేట్ స్కూల్
ఆరోగ్యం బాగా లేకపోతే ప్రైవేట్ హాస్పిటల్
మంచినీళ్లు కావాలంటే ప్రైవేట్ మినరల్ వాటర్
.. పొయ్యాలంటే ప్రైవేట్ పే అండ్ యూజ్ టాయిలెట్

వెహికిల్ కొంటే వెహికిల్ ట్యాక్స్.. రోడ్డెక్కితే టోల్ ట్యాక్స్
సిటీ దాటి వెళితే రోడ్లకి ప్రైవేట్ టోల్ ట్యాక్స్..
ఇలా చెప్పుకుంటూ పోతే ఈ పేపర్ చాలదు..

ఒకపక్క ప్రభుత్వానికి పన్నులు కడుతున్నాం.. మరోపక్క ప్రైవేట్ సేవలకి ఫీజులు కడుతున్నాం,
ఈ డబుల్ ధమాకా ఆఫర్ ఒక్క మనదేశంలోనే..

**ఎందుకిలా?**

స్కూళ్లు, హాస్పిటళ్లు అంటే ప్రైవేట్‌కి వెళతాం.. కానీ, మనం కొనుక్కునే వస్తువు నాణ్యత



**మన హైదరాబాద్ లేదా ఇతర నగరాలు మంచి సదుపాయాలతో ఎదగాలి అంటే.. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి.. పాలన ప్రజలకి దగ్గరగా రావాలి. అధికారం ప్రజలకి అందుబాటులో ఉండాలి.. తప్పులు జరిగితే నిలదీయగలిగేంత దగ్గరగా ఉండాలి. ఈ లక్ష్యం సాధించడం కోసం ఆవిర్భవించిన సంస్థే ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్. రోజువారీ అవినీతిని కట్టడిచేసి, పనులు చేయించుకోవటం మొదలుపెట్టాక, పైస్థాయి అవినీతిని నియంత్రించే వ్యవస్థలు, అక్కడ్నుంచీ అందాల్సిన సేవల మీద కూడా దృష్టి పెడదాం.. ఇదంతా లోక్‌సత్తా భాష, లోక్‌సత్తా దిశ అని వేరే చెప్పనక్కర్లేదు.**

లేకపోతే, మన పిల్లల కోసం పాల ప్యాకెట్‌లో కల్తీ ఉంటే.. వీకెండ్ సరదాగా బయట డిన్నర్‌కి వెళితే వాడు మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీలో కుళ్లిన కూరగాయలు మిక్స్ చేస్తే.. జంతువుల ఎముకల నుంచి తీసిన నూనెతో ఫ్రై చేస్తే.. మనం ఆఫీసుకి వెళ్లాల్సిన రోడ్డు గుంతలతో నిండిపోతే.. మనం పీల్చే గాలిలో పరిశ్రమలు విషవాయువులు వదిలేస్తుంటే.. ఏం చెయ్యాలి.. దీనికి ప్రైవేట్ పరిష్కారాలు ఏమీ లేవే..? మరి ఎలా? ఒక పక్క డబ్బులు పోతున్నాయ్...మరోపక్క జబ్బులు వస్తున్నాయ్.. మన బతుకికి ఏది భరోసా?

మీరు అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లలో ఉంటుంటే.. అక్కడ మీకో విషయం అనుభవంలోకి వచ్చి ఉంటుంది..

అదేమిటంటే.. మెయింటినెన్స్ ఛార్జీలు ఎక్కువో, తక్కువో, పనులు మాత్రం చాలా ఫాస్ట్‌గా అవుతాయి. డ్రైనేజ్ జాం అయినా, నీళ్లు రాకపోయినా, పార్కింగ్ సమస్య వచ్చినా.. చిన్న చిన్న రిపేర్లు అయినా చకచకా జరిగిపోతాయి. ఎవర్నీ బతిమిలాడాల్సిన అవసరం ఉండదు.. లంచం ఇవ్వాల్సిన అవసరం అంతకన్నా ఉండదు. అదే మన గ్రేటర్ హైదరాబాద్ విషయానికి వస్తే మన కాలనీ రోడ్డు మీద గుంత పూడ్చాలన్నా నెలలు పడుతోంది. ఎందుకిలా ఉంటే.. అపార్ట్‌మెంట్ అసోసియేషన్స్‌లో అధికారం, బాధ్యత కలగలసి ఉంటాయి. చిన్నచిన్న విభేదాలు, అపార్థాలు ఉన్నా కూడా. అందుకే సమస్యలు పరిష్కారం అవుతాయి. అదే జీహెచ్‌ఎంసీయో, మరో ఎంసీయో విషయానికి వస్తే.. పన్నులు వసూలు చేసే అధికారమేకానీ ప్రజలకి సేవలు అందించాలన్న కనీస బాధ్యత ఉండదు. జవాబుదారీతనం ఉండదు. మరి ఏమిటి దీనికి పరిష్కారం?

మన హైదరాబాద్ లేదా ఇతర నగరాలు మంచి సదుపాయాలతో ఎదగాలి అంటే.. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి.. పాలన ప్రజలకి దగ్గరగా రావాలి. అధికారం ప్రజలకి అందుబాటులో ఉండాలి.. తప్పులు జరిగితే నిలదీయగలిగేంత దగ్గరగా ఉండాలి. ఈ లక్ష్యం సాధించడం కోసం ఆవిర్భవించిన సంస్థే ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్. రోజువారీ అవినీతిని కట్టడిచేసి, పనులు చేయించుకోవటం మొదలుపెట్టాక, పైస్థాయి అవినీతిని నియంత్రించే వ్యవస్థలు, అక్కడ్నుంచీ అందాల్సిన సేవల మీద కూడా దృష్టి పెడదాం.. ఇదంతా లోక్‌సత్తా భాష, లోక్‌సత్తా దిశ అని వేరే చెప్పనక్కర్లేదు.

**పన్నులు కడుతున్నాం.. మరి పనులు జరుగుతున్నాయా? అని ప్రశ్నించడానికి పుట్టిందే ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్..**

పన్నులకు తగ్గ సేవలు అందాలి అంటే.. మన చర్చ మారాలి.. మన మాట మారాలి.. పార్టీ రాజకీయాల్ని ఎన్నికల నెలకే పరిమితం చేసి, మిగిలిన 59 నెలలు ప్రభుత్వాల తీరు గురించి, మన పన్నుల డబ్బుకి తగ్గ సేవలు పొందడం గురించి మనం మాట్లాడాలి.

అందుకే ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా చేరదాం.. తెలంగాణ కావచ్చు, ఆంధ్రప్రదేశ్ కావచ్చు మన ప్రాంతంలో ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్‌ని ఏర్పాటు చేసుకుందాం. ఒక్కటిగా కదులుదాం.. మన సమస్యలను పరిష్కరించుకుందాం..

వివరాలకు:
ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్,
రిజిస్టర్డ్ నెం.1814/2017, తెలంగాణ,
ఇంటి నెం.15-31-2ఎం-64/2,
ఫేజ్ 3, కేపీహెచ్‌బీ కాలనీ,
మేడ్చల్ జిల్లా,
హైదరాబాద్-500085
ఫోన్: 99124 15128, 94404 99778
E-mail: taxpayers365@gmail.com,
fb: Taxpayers365

# ఇందిర అవివేకపు చర్యలను మోదీ ఎందుకు నిర్మూలించటం లేదు?

- శేఖర్ గుప్తా,
ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్




ఏదైనా కంపెనీలో ఎవరైనా వాటాదారుని పిలిచి అడగండి. మీ ధనంతో మీ యాజమాన్యం కనుక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మీరు బయటికి వస్తారా అని అడగండి. వారు తప్పనిసరిగా వస్తారు. కానీ వారు ప్రభుత్వరంగ సంస్థలో ఉంటే మాత్రం ఆ పని చేయరు. పైగా ఆ ఉత్పాతాన్ని ఇంకొంత విస్తరింపచేయడానికి ఇంకొంత ధనాన్ని కూడా ధారపోస్తారు. ఎందుకు? ఎందుకంటే, అది మీ ధనం కాదని మీకు తెలుసు. ఆ ధనం ఆలోచనలేని వాళ్లది. మూర్ఖులది. వీరి ధనాన్ని ధారపోసి భవిష్యత్తులో వారి కోసం ఏదో చేస్తామన్న భ్రాంతిని కలిగిస్తాం. ఇది చాలా అన్యాయమే అయినప్పటికీ పన్ను ఎగవేతదారులు, దివాలాకోరులు తాము దివాలా తీయించినవాటినే మరిన్ని రాయితీలతో తిరిగి తీసుకోవాలని అనుకుంటున్నారు. దావోస్‌లో ప్రధాని మోదీతో కలిపి తీయించుకున్న గ్రూప్ ఫోటోలో అలాంటి వ్యక్తులు కనిపిస్తారు.

ఇది మీకు ఆవలింతలు తెప్పించినా మరొకసారి కూడా చెప్పక తప్పదు. చాలామందిలాగే ఈ సూక్తి గురించి నేను కొంచెం చెబుతాను. సంక్షోభంలో ఉన్న అవతలి వారిని అణచివేసే అవకాశం వచ్చినప్పుడు ఎప్పుడూ విడిచిపెట్టకూడదు. ఇంత ప్రాచుర్యం ఉన్నప్పటికీ ఈ ప్రవచనాన్ని చాలా తక్కువ సందర్భాలలో మాత్రమే ఉపయోగిస్తూ ఉంటారు. ఎందుకంటే దీనిని ప్రయోగించాలంటే ఒకింత సాహసం అవసరం. అధికారులకీ, ఉద్యోగంలో ఉంటూ కాలక్షేపం చేసేవాళ్లకీ, రిస్క్ తీసుకోవడం ఏమాత్రం ఇచ్చగించనివారికి ఇది ఐచ్ఛికం కూడా. ఇక్కడ ఈ సూక్తిని మళ్లీ మోగించడానికి కారణం– ప్రధాని నరేంద్రమోదీ పైన చెప్పుకున్న ఆ ముగ్గురు మనుషుల లాంటి వారు కాదని చెప్పడానికే. ఇందిరాగాంధీ తరువాత భారత రాజకీయాలలో రిస్క్‌ను ఎదుర్కోవడానికి ఏమాత్రం వెనుకాడని నాయకుడు నరేంద్ర మోదీయే. అయితే హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే, సరిగ్గా ఇందిరాగాంధీ చేసిన ఘోరమైన చర్యలను తుడిచిపెట్టడానికి ఆయనకు తగిన ధైర్యం ఉండాలని మనం కోరు కుంటున్నాం.

1969లో కాంగ్రెస్ పార్టీని చీల్చిన తరువాత సోషలిస్టు సమాజం కోసమన్న పేరుతో ఇందిరాగాంధీ పెద్ద వాణిజ్య బ్యాంకులను జాతీయం చేస్తున్నట్టు నాటకీయంగా ప్రకటించారు. 1991లో బ్యాంకు సంస్కరణలు అమలుపరిచే వరకు కూడా ఈ బ్యాంకుల జాతీయకరణ కార్యక్రమం జరిగింది. బీమా, బ్యాంకుల జాతీయకరణ ద్వారా, అభివృద్ధికి సంబంధించిన అన్ని ఆర్థికసంస్థలను ఆమె ప్రభుత్వ అధీనంలోకి తెచ్చారు. ఆ విధంగా మొత్తం భారత సంప్రదాయక ఆర్థిక వనరుల మీద ప్రభుత్వ పెత్తనం తీసుకువచ్చారు. అయితే తను చేపట్టిన నకిలీ, సంపద తరుగుదల సామ్యవాదాలకే ఎన్నికల తరువాత ఎన్నికలలో ఆమెకు విజయాలు చేకూరాయి. తాను సంపన్నుల నడ్డి విరుస్తున్నానని ఆమె పేదలను నమ్మించగలిగారు. అలాగే భవిష్యత్తులో పేదల కోసం ఏదో మేలు చేయ బోతున్నట్టు నమ్మించారు.

అయితే పేదలకు ఎలాంటి మేలు జరగలేదు. కానీ వారు మాత్రం మోసానికి గురవుతూనే ఉన్నారు. ఆమె ఎన్నికలలో తన విజయయాత్రను సాగిస్తూనే ఉన్నారు. 1973లో చమురు సెగ తగలడం (యోమ్ కిప్పుర్ యుద్ధం తరువాత)తోపాటు, ఇతర పరిణామాలతో భారత ద్రవ్యోల్బణం రేటును తారాస్థాయికి, అంటే 1920ల నాటి స్థాయికి తీసుకుపోయాయి. దీనితోనే ఆమె ఆర్థిక విధానాల్లోని డొల్లతనం బయటపడిపోయింది. సోషలిస్టు పూనకంతో వూగిపోయిన ఆ దశ నుంచి బయటపడి మళ్లీ పునరుత్తేజం పొందడానికి గడచిన నలభై

సంవత్సరాల నుంచి భారతదేశం శ్రమిస్తూనే ఉంది. భారతదేశం తన మూర్ఖత్వం ఏమిటో తను గుర్తించింది కానీ, మనం మరో జాతీయ ప్రయోజనాన్ని పరీక్షించే పనిలో ఉండడం వల్ల ఆ పని చాలా ఆలస్యమై పోయింది.

ప్రభుత్వాల ప్రజాకర్షక విధానం ఎంత ఆకర్షణీయమో, ఎంత సులభమో మన రాజకీయ చరిత్ర చక్కగా చెబుతుంది. ఆ విధానాన్ని తలకిందులు చెయ్యడం ఎలాంటి సవాలో, ఎంత ప్రమాదకరమో, అందువల్ల ఎంత అపఖ్యాతి పాలు కావలసి వస్తుందో కూడా రాజకీయ చరిత్ర చెబుతుంది. సంస్కరణవాదులలో అతి సాహసికులు మాత్రమే అలాంటి 'పాంగాస్' (గనిలో నడవడం అని స్థూలంగా చెప్పవచ్చు)కు సిద్ధపడతారు. పీవీ నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ 1991లో ఇలాంటి సాహసం చేశారు. తరువాత యశ్వంత్‌సిన్హా, జస్వంత్‌సింగ్‌లతో కలసి అటల్ బిహారీ వాజపేయి కూడా అలాంటి సాహసం చేసినవారే. అయితే మోదీ నుంచి ఇంతకు మించిన నాటకీయమైనదానిని దేనినో మనం ఆశిస్తున్నాం. ఇందిర పుణ్యమా అని దాదాపు దివాలా స్థితికి వచ్చిన బ్యాంకులు ఆయనకు దక్కాయి. దేశంలోని సంపన్నవర్గాలకీ, అత్యంత అవినీతిపరులకీ రుణాలు పందారం చేసి, పన్ను చెల్లింపుదారులు నిజాయతీగా చెల్లించిన ధనాన్ని ఆ బ్యాంకులకు ధారపోస్తున్నారు.



ఆపరా! కన్నం వేసి లాభం లేదు!!

దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకులే దేశ ఆర్థికవ్యవస్థకు ఇప్పటికీ కీలకంగా ఉన్నాయి. 55 నుంచి 60 శాతం వరకు భారత్ మార్కెట్‌కు ఈ బ్యాంకులే జవాబుదారులు. ఇందులో ఎక్కువ బ్యాంకులు షేర్‌మార్కెట్‌లో లిస్ట్ అయినవే కూడా. అయితే ఈ విషయాన్ని బాగా గుర్తుపెట్టుకోండి. మీరంతా ఊపిరి బిగబట్టి వినండి. ఘనత వహించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా అన్ని బ్యాంకుల మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) (ఇవాల్టికి రూ.50,000కోట్లు) పాతికేళ్ల క్రితం ఆవిర్భవించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ కంటే తక్కువ. ప్రైవేటు బ్యాంకులతో పోల్చి చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు దశాబ్దాల నాటి ఇంకా చెప్పాలంటే శతాబ్దాల క్రితం నాటి వారసత్వాన్నే కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ సంపదను కోల్పోతున్న క్రమం ఈరీతిలో ఉంది.

ఏదైనా కంపెనీలో ఎవరైనా వాటాదారుని పిలిచి అడగండి. మీ ధనంతో మీ యాజమాన్యం కనుక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మీరు బయటికి వస్తారా అని అడగండి. వారు తప్పనిసరిగా వస్తారు. కానీ వారు ప్రభుత్వరంగ సంస్థలో ఉంటే మాత్రం ఆ పని చేయరు. పైగా ఆ ఉత్పాతాన్ని ఇంకొంత విస్తరింపచేయడానికి ఇంకొంత ధనాన్ని కూడా ధారపోస్తారు. ఎందుకు? ఎందుకంటే, అది మీ ధనం కాదని మీకు తెలుసు. ఆ ధనం ఆలోచనలేని వాళ్లది. మూర్ఖులది. వీరి ధనాన్ని ధారపోసి భవిష్యత్తులో వారి కోసం ఏదో చేస్తామన్న భ్రాంతిని కలిగిస్తాం. ఇది చాలా అన్యాయమే అయినప్పటికీ పన్ను ఎగవేతదారులు, దివాలాకోరులు తాము దివాలా తీయించినవాటినే మరిన్ని రాయితీలతో తిరిగి తీసుకోవాలని అనుకుంటున్నారు. దావోస్‌లో ప్రధాని మోదీతో కలిపి తీయించుకున్న గ్రూప్ ఫోటోలో అలాంటి వ్యక్తులు కనిపిస్తారు.

భారతీయ బ్యాంకులు ఆగి ఆగి ఇలాంటి దారుణమైన రుణ సంక్షోభంలో చిక్కుకుంటూ ఉంటాయి. ఇలాంటి పనికి పాల్పడ్డవారి జాబితాను పరిశీలిస్తే ఒకే రకమైన వ్యక్తులే ఇందుకు పాల్పడుతున్న సంగతి అర్థమవుతుంది. ఇదెలా జరుగుతుందంటే వారు తిరిగి రుణం కోసం అదే సర్కారీ బ్యాంకులకు వెళ్లగలరు. మళ్లీ మోసపూరితమైన ప్రతిపాదనలు చూపి రుణాలు తీసుకోగలరు. మళ్లీ చెల్లించడం విఫలం కాగలరు కూడా. చారిత్రకంగా ఇదంతా మనకు తెలిసినప్పటికీ నమ్మశక్యమైన ఒక ఆర్థికవ్యవస్థను కలిగిఉన్నాం. అక్కడ రుణం క్షమించదగినదే. ఈ జాబితాలో ఉన్నవారు మళ్లీ మళ్లీ మోసగిస్తున్న బ్యాంకులన్నీ ప్రభుత్వ బ్యాంకులేనని మళ్లీ గుర్తుచేస్తున్నాను. ప్రైవేటు బ్యాంకులు ఆఖరికి మాల్యా నుంచి కూడా తమకు రావలసినదంతా వసూలు చేసుకున్నాయి. బ్యాంకుల జాతీయకరణ ద్వారా ఇందిరాగాంధీ పేదలకు ఎలాంటి మేలు చేయాలని ఆశించారో కానీ, దానిని చాలా కార్పొరేట్ సంస్థలు తెలివిగా తమకు ఉపయోగించు కుంటున్నాయి.

2008 నవంబర్ 13న, ఫరీద్ జకారియా న్యూఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ వార్షిక స్మారకోపన్యాసం చేశారు. సంపన్న ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతున్న క్రమం నుంచి భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ తప్పించుకోవడంపై ఆయన అభినందనలు కురిపించారు. సదస్సు నిర్వాహకురాలి స్థాయిలో ప్రసంగించిన సోనియా గాంధీ, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ భవిష్యజ్ఞానం గురించి పదే పదే ప్రస్తావించారు. భారతీయ బ్యాంకులు సమర్థవంతమైన క్రమబద్ధీకరణ వల్ల కాకుండా ప్రభుత్వ యాజమాన్యంలో ఉండడవే సంక్షోభం నుంచి తప్పించుకోవడానికి ఏకైక కారణం అనే రీతిలో ఆమె ప్రసంగం

సాగింది. గత సంవత్సరం జరిగిన హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సు సందర్భంగా కూడా సోనియాగాంధీ ఈ అంశాన్నే పదే పదే నొక్కిచెప్పారు.

ఇందిరాగాంధీ చేసిన అతి గొప్ప ఆర్థిక తప్పిదానికి గాంధీ (నెహ్రూ) కుటుంబం అంత గొప్ప విలువను ఇచ్చి పరిరక్షిస్తూ వస్తోంది. బ్యాంకులను ప్రభుత్వ యాజమాన్యం నుంచి తప్పించడం కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ ప్రభుత్వానికి కూడా సాధ్యం కాదనే భావనను కాంగ్రెస్ అధిష్ఠానం బలంగా ముద్రించింది. కానీ ప్రధాని నరేంద్రమోదీ సైతం అలాంటి మనోభావానికి ఎందుకు కట్టుబడి ఉన్నారనేదే మనల్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

జవహర్‌లాల్ నెహ్రూ అమలుపర్చిన ప్రతి విధానాన్ని తిరగదోడాలని మోదీ కోరుకోవడం ఆశ్చర్యకరమైన విషయం. వీలు చిక్కినప్పుడల్లా నెహ్రూకు మరకలంటించాలని మోదీ చూస్తుంటారు. కానీ నెహ్రూ కుమార్తె చేపట్టిన అత్యంత అవివేకపు విధానాల్లో కీలకమైనదాన్ని మోదీ ఎందుకు పట్టించుకోవడంలేదో అర్థం కావడం లేదు. దేశంలో బ్యాంకుల జాతీయకరణ కంటే మించిన అవివేకపు చర్య మరొకటి లేదు. దేశంలోని బ్యాంకులు సంపన్నులకు తప్ప పేదలకు రుణాలు ఇవ్వడం లేదనే అతి అంచనాకు ఇందిరాగాంధీ 1969లో వచ్చారు. కానీ ఆమె చేసిన బ్యాంకుల జాతీయకరణకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అవే బ్యాంకులు కుప్పకూలిపోతున్నాయి. కారణం.. అవి ఎలాంటి ప్రశ్నలూ వేయకుండానే సంపన్నులకు రుణాలను అధిక మోతాదులో గుమ్మరించి, ప్రజాధనం దోపిడీకి మార్గం వేయడమే.

బ్యాంకుల జాతీయీకరణను కొనసాగించడమే కాకుండా 2.11 లక్షల కోట్ల పన్ను చెల్లింపుదారుల డబ్బును కరిగించేసిన రాజకీయ తప్పిదాన్ని మనం ఏమని పిలవాలి? పంజాబ్ నేషనల్ బ్యాంకు.. మహారాష్ట్ర సుగర్ బెల్ట్‌కు చెందిన రాజకీయ బందిపోట్ల యాజమాన్యంలోని చిన్న సహకారు బ్యాంకును పోలిన మరీ పనికిరాని బ్యాంకు ఏమీ కాదు. అది దేశంలోనే రెండవ అతిపెద్ద ప్రభుత్వ బ్యాంకు. ప్రపంచంలోనే అత్యంత ధనిక బందిపోట్లు సంవత్సరాలుగా ఆ బ్యాంకులో దూరారని ఇప్పుడు బయటపడ్డ కుంభకోణం తెలుపుతోంది. పలుసార్లు చేసిన ఆడిటింగ్ కానీ, ప్రభుత్వం లేక ఆర్థిక శాఖ నామినేట్ చేసిన ప్రభుత్వ బోర్డు సభ్యులు కానీ ఈ భారీ కుంభకోణం గురించి కనిపెట్టలేక పోయారు. ఆ స్థాయిలో బ్యాంకులు చిల్లు వేయడం, జాగురూకత లేకపోవడం, ఆడిటింగ్ వైఫల్యం మొత్తం జాతి సిగ్గుపడాల్సిన విషయం.

అందుకే నరేంద్రమోదీ ఈ బ్యాంకును ఇక ఎత్తికుదేయాల్సి ఉంటుంది. దాన్ని అమ్మేసి ఇక ఆ ఉదంతాన్ని మర్చిపోవాల్సి ఉంటుంది. ఇంతకుమించిన ప్రజాకర్షక అంశం ఇప్పుడు మరొకటి ఉండదు. తాను అసహ్యించుకుంటున్న కాంగ్రెస్ రాజరికంలోని రెండో కీలకమైన సభ్యుడిని తప్పుపట్టే విషయంలో మోదీకి ఈ చర్యే పూర్తి సంతృప్తి కలిగిస్తుంది కూడా.

(సాక్షి సౌజన్యంతో) ✦

# దగా రాజకీయాలపై మేలుకోండి

**బ**డ్జెట్‌లో, విభజన హామీల అమలులో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ లోక్‌సత్తా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మాదాసు భానుప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు చిలకలూరిపేటలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రాయితీల సాయం అందించాలని ప్రతిపాదించింది జేపీయేనని, ఆరోజు కనీసం మాట్లాడకుండా పారిపోయినవాళ్లు ఇప్పుడు దబ్బాలు కొట్టుకుంటూ సన్మానాలు చేయించుకుంటున్నారని వారు అన్నారు. మనం ఎన్నుకుంటున్న వారిలోనే లోపం ఉందన్నారు. మన నేతలు సరిగ్గా ఉంటే, ఢిల్లీ నుంచి ఈపాటికే సరైన సాయం వచ్చేదన్నారు. ప్రజలు మేలుకొని వాస్తవాల్ని గుర్తించాలని, పరిష్కార రాజకీయంలో భాగమై తమ జీవితాల్ని, తమ బిడ్డల భవిష్యత్తుని బాగు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.





# నేర నేతలపై విచారణకు ప్రత్యేక కోర్టులు

నేరారోపణలున్న 1581 మంది శాసనకర్తలపై విచారణకు ప్రత్యేక కోర్టులను ప్రారంభించటానికి 2017లో సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు పూర్తయింది. తొలిదశలో దేశవ్యాప్తంగా 12 చోట్ల ఈ కోర్టుల్ని ఏర్పాటు చేస్తున్నట్టు, ఇందుకోసం రూ.7.8 కోట్లు కేటాయించినట్టు కేంద్ర ప్రభుత్వం తన అదనపు ప్రమాణపత్రంలో తెలిపింది. అత్యున్నత న్యాయస్థానం సూచన మేరకు.. నిధుల్ని సంబంధిత రాష్ట్రాలకు దామాషా పద్ధతిలో కేటాయించారు. రాష్ట్రాలు సంబంధిత హైకోర్టులతో చర్చించాలని, హైకోర్టులు తమ పరిధిలోనే కేసుల నుంచి శాసనకర్తలకు సంబంధించినవి విడదీసి ప్రత్యేక న్యాయస్థానాలకు అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలన్నీ తాత్కాలికమైనవని, ప్రత్యేక న్యాయస్థానాలు పనిచేయడానికి ఉద్దేశించినవని, అవసరమైనప్పుడు ఆ ఆదేశాల్లో

## డబ్బు చుట్టూ ఎన్నికల వ్యవస్థ వల్లే..

ఎన్నికలలో నేరచరితులు పోటీచేయటం ప్రజాస్వామ్యానికి, దేశ ప్రయోజనాలకీ తీవ్ర నష్టం చేస్తుందంటూ నేరరాజకీయాలకు వ్యతిరేకంగా వ్యవస్థీకృత పోరాటానికి నాంది పలికింది లోక్‌సత్తా. ఎన్నికలలో పోటీ చేసే నేరచరిత్రుల జాబితాను 1999లో లోక్‌సత్తా విడుదల చేశాక ఎన్నికల సంఘం కూడా ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. పోటీ చేసే ప్రతి అభ్యర్థీ తన వివరాలను తెలియచేయాల్సిందే అన్న ప్రతిపాదనకు వ్యతిరేకంగా బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదిస్తే, లోక్‌సత్తా అభ్యర్థన మేరకు అప్పటి రాష్ట్రపతి డా॥ ఏపీజే అబ్దుల్ కలాం ఆ బిల్లును తిప్పిపంపారు. చివరకు లోక్‌సత్తా సుప్రీంకోర్టులో పోరాటం చేసి.. ఎన్నికల్లో అభ్యర్థులు విధిగా తమ నేరచరిత్ర సహా వివరాలు వెల్లడించేలా చట్టాన్ని 2003లో సాధించింది. అయితే నేరచరిత్రులు వివరాలు వచ్చినా సమస్య పూర్తిగా తగ్గలేదు. వరకట్నం తీసుకోకూడదంటూ చట్టం ఉన్నంత మాత్రాన కట్నాలు తీసుకోవటం, వాటి కోసం వేధించటం ఆగకపోవచ్చు. కానీ ఆ చట్టం కూడా లేకపోతే పరిస్థితి మరీ దిగజారి అసలు రక్షణ లేకుండా పోతుంది. అలాగే.. నేరచరిత్రులు బరితెగించకుండా అడ్డుకోవటానికి 2003 చట్టం కొంత ఉపయోగపడింది. అయితే 2014లో 56 కోట్ల మంది ప్రజలు 9,00,000 పోలింగ్ స్టేషన్లలో వేసిన ఓటు ద్వారా ఎన్నికైన 542 మంది ఎంపీలలో 34శాతం మంది నేరారోపణలు ఎదుర్కొన్నవారేనని గణాంకాలు చెబుతున్నాయి. గతంలో కంటే ఈ సంఖ్య పెరిగింది. నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు 2004లో 24శాతం ఉంటే, 2009లో 30శాతం ఉన్నారు.

2014లో గెలిచిన ఎంపీలలో 20శాతానికిపైగా ఎదుర్కొంటున్న ఆరోపణలు తీవ్ర నేరాలకు సంబంధించినవి. హత్యాప్రయత్నం, ప్రభుత్వాధికారులపై దాడి, దొంగతనం వంటి నేరాలలో వీరు నిందితులు. గత ఎన్నికల్లో అధికార బీజేపీ నిలబెట్టిన అభ్యర్థుల్లో 14శాతం మందిపై ఇలాంటి తీవ్ర నేరారోపణలున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల్లో 10శాతం మందికిపైగా ఇదే తరహా ఆరోపణలు ఎదుర్కొంటున్నవారున్నారు. ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ అధ్యయనం ప్రకారం.. దేశవ్యాప్తంగా 4032 మంది ఎమ్మెల్యేల్లో 1258 మందిపై నేరారోపణలుండగా, 15 శాతం మందిపై తీవ్ర నేరారోపణలున్నాయి.

దీర్ఘకాలంపాటు మనుగడ సాగించాలని, వీలైనంత ఎక్కువ కాలం అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండాలని, దేశానికి వీలైనంత మంచి చేయాలని అనుకుంటున్న నాయకులు, పార్టీలు కూడా ఎందుకు నేరచరిత్రులను ప్రోత్సహిస్తున్నాయీ అంటే.. డబ్బు కోసం అన్నదే సమాధానం.

ఎందుకింత డబ్బు? భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో సుమారు 30లక్షల ప్రాతినిధ్య పదవులు ఉంటే.. వాటిలో పోటీపడి గెలవటానికి విపరీతమైన డబ్బు అవసరమవుతోంది. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల స్థాయిలో కాకపోయినా.. మిగిలిన చోట్ల కూడా డబ్బు ఎన్నికలలో పోటీకి ఒక కనీస అర్హతగా మారిపోయింది. ఎలాంటి నిధులు, అధికారాలు లేని మూడో అంచెలో (స్థానిక ప్రభుత్వాలలో) ఎన్నికలకు కూడా కోట్లు గుమ్మరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీకయ్యే నిర్వహణ ఖర్చుల్ని, అద్దె కార్యకర్తల్ని, కృత్రిమ సభల్ని భరించేందుకు నేరచరిత్రులే ఎక్కువగా ముందుకొస్తున్నారు. ఇటీవల వైట్‌కాలర్ ముసుగేసుకుంటున్న ఈ కళంకితులతో ఆర్థిక అవసరాల దృష్ట్యా చట్టబద్ధ పాలనను, న్యాయసంస్కరణల్ని ఫణంగా పెట్టి మరీ వీరిని నాయకులుగా పార్టీలు ప్రొజెక్ట్ చేస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు రోజువారీ పనులు చేసిపెట్టటానికి, తమకు స్థానికంగా రక్షణ కల్పించటానికి, కులం, ప్రాంతం, మతం వంటి చీలికలలో తమకు ప్రయోజనం చేకూర్చటానికి, తమ వివాదాలు కోర్టు దాకా వెళ్లకుండా మధ్యవర్తులుగా పరిష్కరించటానికి ప్రజలు కూడా నేరచరిత్రుల్ని ఎన్నుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా పనులు చేయించేందుకు పౌర సేవల చట్టం, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి సంస్కరణల్ని తేవటంలో పార్టీలు చేస్తున్న తాత్సారం సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తోంది.

## ఈ సమస్యపై పార్లమెంటు సరిగా దృష్టి పెట్టటం లేదు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇక నుంచి తమ ప్రమాణపత్రంలో కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలతోపాటు ఆదాయమార్గాలను కూడా వెల్లడించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యం నెలకొనాలంటే ఎన్నికల ప్రక్రియ పరిశుద్ధంగా ఉండాలని అభిప్రాయపడింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వారి భార్యాపిల్లల ఆస్తుల వివరాలను క్రమం తప్పకుండా సేకరించే యంత్రాంగాన్ని నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆదాయ వనరులకు మించిన ఆస్తులున్నట్టు యంత్రాంగం పరిశీలనలో తేలితే తగిన చర్యలను సిఫారసు చేయాలని చెప్పింది. 'అక్రమ ఆస్తులున్నట్టు తేలితే సదరు ప్రజాప్రతినిధులపై సంబంధిత చట్టసభకు నివేదిక ఇవ్వాలి. వారిని అసెంబ్లీ/పార్లమెంటులో కొనసాగించాలో వద్దో సదరు చట్టసభే నిర్ణయించుకోవాలి' అని జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ ఎల్. అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. అభ్యర్థి కుటుంబ సభ్యుల ఆస్తులు, ఆదాయ వనరులు వెల్లడించకపోవడం ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని అవినీతి వ్యవహారాల కిందకు వస్తుందని తెలిపింది. 'ప్రజాప్రతినిధుల ఆస్తులపై పౌరులను, ఓటర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ లక్షణం. ఆ వివరాలన్నీ తెలుసుకోవడం ఓటర్ల ప్రాథమిక హక్కు' అని పేర్కొంది. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాల వివరాలను వెల్లడించే విధంగా చట్టం కూడా తేవాలని ధర్మాసనం చెప్పింది. ఎంపీలు, ఎమ్మెల్యేల కుటుంబ సభ్యుల ఆస్తులు ఆదాయం వనరులకు మించి పెరిగితే దర్యాప్తు చేసేందుకు శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రహరీ అనే స్వచ్ఛందసంస్థ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. పిటిషన్లో కొద్దిమంది నేతల పేర్లను ప్రస్తావిస్తూ వారిపై దర్యాప్తు చేయాలని కోరగా, సుప్రీంకోర్టు అందుకు నిరాకరించింది. 'నేతలను అనర్హులుగా ప్రకటించడం వెనుక ఉద్దేశం ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడటం' అని స్పష్టంచేసింది. రాజకీయ అవినీతిని పట్టించుకోకపోతే చివరకు అది ప్రజాస్వామ్య వ్యవస్థ విధ్వంసానికి, మాఫియా పాలనకు దారితీస్తుందని హెచ్చరించింది. దురదృష్టవశాత్తూ భారతదేశంలో పార్లమెంటు ఈ సమస్యపై సరిగా దృష్టి సారించడం లేదని విచారం వ్యక్తం చేసింది. అడ్డగోలుగా ఆస్తులు పోగేసుకున్న ప్రజాప్రతినిధిని అనర్హుడిగా ప్రకటించడానికి అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరపాల్సిన అవసరం లేదని, నిబంధనలను మార్చే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని వ్యాఖ్యానించింది. ఒక ప్రజాప్రతినిధిని అనర్హుడిగా ప్రకటించేందుకు నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ అవసరమని చెప్పింది. అభ్యర్థి, అతని కుటుంబ సభ్యుల ఆస్తులు, ఆదాయ మార్గాల సమాచారం తెలియడం వల్ల ఓటరుకు పూర్తి ఎరుకతో సరైన అభ్యర్థిని ఎంపిక చేసుకునేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొంది. అలాంటి సమాచారం అందుబాటులో ఉంటేనే పౌరుడు తన ప్రతినిధి ఎంపికలో హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోగలడని తెలిపింది. చట్టం చేయడమన్నది పార్లమెంటు స్వయంగా తీసుకోవాల్సిన నిర్ణయమని, న్యాయస్థానాలు సూచనలు ఇవ్వగలవేగానీ, బలవంతం చేయలేవని పేర్కొంది. సంపదలు ఒకచోట పోగుపడకుండా చూడటం ప్రభుత్వపు రాజ్యాంగ బాధ్యత అని గుర్తుచేసింది.

### Aftermath of Criminalisation of Politics

The Second Administrative Reforms Commission (2005) had noted that the "opportunity to influence crime investigations and to convert policemen from being potential adversaries to allies is the irresistible magnet drawing criminals to politics."

తగిన మార్పుల్ని చేస్తామని స్పష్టంచేసింది. ప్రత్యేక కోర్టులకు సంబంధించి ప్రస్తుత సంఖ్యే చిట్టచివరిది కాదని వ్యాఖ్యానించింది.

కేంద్ర ప్రభుత్వం సమర్పించిన ప్రమాణపత్రం ప్రకారం ఎంపీలపై కేసుల విచారణకు రెండు న్యాయస్థానాలు ఏర్పాటుకానున్నాయి. ఇవికాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో ఒక్కో న్యాయస్థానం ఏర్పాటవుతుంది. ఒక్కో న్యాయస్థానం 165 కేసుల్ని పరిష్కరించగలదని 11వ ఆర్థికసంఘం చేసిన విశ్లేషణ ఆధారంగా వీటిని ప్రతిపాదించారు. ఇంతకంటే తక్కువ కేసులున్న రాష్ట్రాల్లో వాటిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు నివేదిస్తారు.

అయితే సుప్రీంకోర్టు ఆదేశాలు.. చట్టం ముందు అందరూ సమానమే అని హామీ ఇచ్చే భారత రాజ్యాంగంలోని 14వ అధికరణానికి విరుద్ధమన్న వాదనల్ని కొందరు నేతలు వినిపిస్తున్నారు. పోలీసు, న్యాయ వ్యవస్థల్లోని లసుగులను ఉపయోగించుకుని అమాయకులను కేసుల్లో ఇరికిస్తుండే దేశంలో.. అధికార పార్టీ వారు రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయించటంతోపాటు సాక్ష్యాధారాలను కూడా తారుమారు చేసే అవకాశముందంటున్నారు. ✦

# పంచాయతీ రాజ్ కొత్త చట్టం: సాధికారతా? ఇల్లు పీకి పందిరేసుడా?

- **బండారు రామ్మోహనరావు,**
లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలంగాణ, ఏపీ కన్వీనర్




గ్రామ పంచాయతీలకు కొత్త చట్టం కోసం తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ సంఘం వరుసగా 5 రోజులు సమావేశాలు నిర్వహించింది. ప్రతిరోజూ ఒక అధికారిక 'లీకేజీ' చేస్తూ సమాచారాన్ని బహిర్గతపర్చింది. నివేదికను సమర్పించేదాకా సస్పెన్స్‌ను కొనసాగించింది. సమర్పించిన తరువాత కూడా ఎన్నో శేష ప్రశ్నల్ని మిగిల్చింది.

**ఈ తతంగంలో కొన్ని మౌలికమైన ప్రశ్నలు ఉత్పన్నమైనాయి..**

1) 1994 పంచాయతీ రాజ్ చట్టంలో ఏ మార్పులు చేయదలచుకున్నదీ ప్రజల ముందు ప్రభుత్వం ప్రతిపాదన పెట్టలేదు.

2) మంత్రివర్గ ఉపసంఘం ముందు కూడా స్పష్టమైన ప్రతిపాదనలు ఉన్నాయా లేదా తెలియదు.

3) మంత్రివర్గ ఉపసంఘ సభ్యుల్ని తప్ప ప్రజలు, నిపుణులు, ఇతర ప్రభుత్వ వర్గాలైన స్థానిక ప్రజాప్రతినిధులు.. ఇలా ఎవరినీ చర్చలో భాగస్వాములను చేయలేదు.

4) చట్టసవరణకు ప్రాతిపదిక ఏమైనా ఉందా?.. తెలియదు!

5) ప్రస్తుతం పంచాయతీ చట్టంలో లోపాలు ఏమైనా ఉన్నాయా లేక "ఇల్లు పీకి పందిరి వేసినట్టు" అక్కడక్కడా చట్టానికి తూట్లు పొడిచి మళ్లీ మాట్లు వేస్తారా?.. తెలియదు! – ఇవి మౌలికమైన ప్రశ్నలు.

**పుకార్లు- అనుమానాలు**

- షెడ్యూల్‌కు ముందుగానే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తాం.
- సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షమా? పరోక్షమా?
- పంచాయతీలలో కో ఆప్షన్ మెంబర్ వ్యవస్థ. గ్రామానికి సంబంధించిన ప్రముఖ ఎన్.ఆర్.ఐలకు స్థానం.
- రెండవసారి రిజర్వేషన్లు కొనసాగింపు.
- కొత్త పంచాయతీల ఏర్పాటుకు చర్యలు
- కొత్త ఆర్థిక సంఘానికి 2వేల కోట్ల రూపాయలు.
- ప్రతీ గ్రామ పంచాయతీకి 5, 10, 15, 20, 25 లక్షల రూపాయలు జనాభాను బట్టి కేటాయింపు.
- సర్పంచ్‌ల తొలగింపు ప్రక్రియ – ట్రిబ్యునల్ ఏర్పాటు
- ఇక సర్పంచ్ అనుమతితోనే పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు.

పై ప్రశ్నలకు జవాబులు మంత్రివర్గ ఉపసంఘం వద్ద కూడా లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ కమిటీ వేశారు. చర్చలకు తెరలేపారు. మంత్రివర్గ ఉపసంఘం ఆయన పరిశీలనకు ఈ నివేదికను పంపింది. పై అనుమానాలను, సందేహాలను అలానే ఉంచి.. అంతా ముఖ్యమంత్రే నిర్ణయిస్తారని తీర్మానించింది. మీడియాలో రోజూ వార్తల రూపంలో ప్రతిరోజూ అధికారిక లీకేజీలను విడుదల చేసింది. చట్టం మార్పునకు ప్రాతిపదికలు, ఆ తర్వాత నివేదిక గురించి స్పష్టంగా మంత్రివర్గ ఉపసంఘం ప్రజల ముందుకు తీసుకురాలేదు. తాంబూలాలిచ్చేశాం తన్నుకుచావండి అన్న తరహాలో లీకులు, ఊహాగానాలతో చర్చించుకోండి అని వదిలేశారు.

## కేసీఆర్ చాణక్య రాజకీయ వ్యూహం

చాణక్యుడు తన రాజకీయ శాస్త్రంలో రాజ్యము, రాజు ఏమి చేయాలో చెబుతారు. ప్రభుత్వం, రాజు పనిచేయకున్నా.. ప్రజలకు పనిచేస్తున్నట్టు నటించాలని, ప్రజల్లో ప్రభుత్వ పనితీరు మీద ఏదో ఒక చర్చ జరిగేలా చూసుకుంటుండాలని చెబుతారు. రావణకాష్ఠంలా ప్రజల్లో ఏదో ఒక విషయంపై చర్చ జరుగుతూ, మళ్లీ కొద్దిరోజుల తర్వాత మరో రూపంలో లేదా మరో విషయంపై చర్చకు తెరలేపాలని ఆయనంటారు. ఒక చర్చ ముగిసి 'లాజికల్ కంక్లూజన్' రాకముందే మరొక విషయంపై చర్చ జరిపేలా ప్రభుత్వం, రాజ్యం కొత్త విషయాన్ని తెరపైకి తీసుకొని రావాలంటారు. ప్రజలకు సహజమైన మతిమరుపు ఎక్కువని, ఆ మతిమరుపును పెంచి పోషించే రాజకీయం వల్ల ప్రజలు ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోరని, దానివల్ల ప్రభుత్వం, రాజ్యం పని సులువు అవుతుందని చాణక్యుడు విశ్లేషిస్తారు.

కేసీఆర్ అచ్చంగా గత నాలుగేళ్లుగా ఆ చాణక్యనీతితో వ్యవహరిస్తూ, ప్రతి నెలా ఒక కొత్త చర్చను లేవనెత్తుతూ ప్రభుత్వం చేస్తున్న పొరబాట్లు ప్రజల్లో సీరియస్‌గా తీసుకునే అవకాశం రానీయకుండా శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. మొట్టమొదట ప్రజల కుటుంబ సర్వే మొదలు నేటి పంచాయతీ ఎన్నికల వరకు ఏదో ఒక అంశంపై చర్చను లేవనెత్తుతున్నారు. మధ్య మధ్య కూల్చివేతలు– ఉస్మానియా ఆస్పత్రి మొదలు సెక్రటేరియట్ వరకు. అదో 6 నెలల చర్చ. ఆ తరువాత పరేడ్ గ్రౌండ్స్‌లో సెక్రటేరియట్ నిర్మాణం. ఇలా ప్రతి రోజూ ప్రతిపక్షాలకు పనికల్పిస్తూ అందరూ ఆ విషయం మర్చిపోగానే మరొక కొత్త విషయాన్ని తెరపైకి తేవడంలో కేసీఆర్ ఆరితేరారు.

ప్రస్తుత పంచాయతీ రాజ్ చట్టం విషయాన్నే పరిశీలిస్తే.. రాష్ట్ర విభజన చట్టంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పలు చట్టాలను తెలంగాణ రాష్ట్రం నిలదొక్కుకున్న దాకా రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడానికి రెండేళ్ల వ్యవధి ఇచ్చారు. ఆ వ్యవధిలోపు ఉమ్మడి రాష్ట్ర చట్టాలను యధావిధిగా కొనసాగించవచ్చు లేక సవరణలు చేసుకోవచ్చు.

2015లో మొదటగా పంచాయతీ రాజ్ చట్టాన్నే సమగ్రంగా మారుస్తామని అప్పటి పంచాయతీ రాజ్ సెక్రటరీ రేమండ్ పీటర్ ఆధ్వర్యంలో (టీఎస్‌పీఎఆర్‌డీ) తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, రాజేంద్రనగర్‌లో ఒక వర్క్‌షాప్ నిర్వహించారు. ఆ వర్క్‌షాప్‌లో నేను కూడా పాల్గొన్నాను. రేమండ్ పీటర్‌గారి ముందు కొన్ని కనీస అంశాలను ప్రస్తావించాం.

1) ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టంలో మీరు ఏ అంశాలను మారుద్దామనుకుంటున్నారు?

2) అంశాల ప్రాతిపదికన ఒక నోట్ ఇవ్వండి.

వీటికి ఆయన సమాధానం– అలాంటి ప్రతిపాదనలు ఏమీ లేవు! మీరే చర్చించి మీరే మార్పులు సూచించండని ఉచిత సలహా పడేసి ఆ రోజు చర్చను ముగించారు. ఒక్కరోజులో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టాన్ని మార్చాలంటే.. ఏపీ పంచాయతీ రాజ్ చట్టం కవర్‌పేజీని మార్చేయండని రేమండ్ పీటర్‌తో అన్నాను. చట్టంలోని లోపాల్ని సవరించాలంటే మరో వారం రోజులపాటు వర్క్‌షాప్ కావాలని అడిగాం. దానికి టైం లేదని ఆయన సమాధానమిచ్చారు. వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని హడావుడిగా ముగించారు. ఆ తర్వాత చట్ట మార్పిడి ఏమైందో తెలియదు.

దాదాపు మూడేళ్ల తర్వాత మళ్లీ పంచాయతీ రాజ్ చట్టం మారుస్తామని తెర మీదకు తెచ్చారు. 2015లో మొదలైన ప్రాసెస్ నల్సార్ యూనివర్సిటీ నుంచి మంత్రివర్గ ఉపసంఘం ముందుకొచ్చిందని అంటున్నారు. దీన్ని లోతైన కసరత్తు అనుకుంటే– కొండంత రాగం తీసి.. అన్న చందాన కర్రసాము, కత్తిసాము చేసి మూలనున్న ముసల్దాన్ని కొట్టినట్టుంది. అలాగా సర్పంచ్‌లపై చర్యలకు కొత్తచట్టం చేస్తామని ప్రభుత్వం సెలవిచ్చింది. ఈ కసరత్తుకన్నా ముందు ప్రభుత్వం కొన్ని ప్రశ్నలకు జవాబునిస్తే ప్రజలకు ఎక్కువ స్పష్టత నివ్వగలుగుతుంది.

■ చట్టం ప్రస్తుతం ఎలా ఉంది?

■ ఇందులో ఏమి మార్చాలనుకుంటోంది?

■ చట్టంలో ప్రస్తుత రూపాన్ని మార్చాలనుకోవటంలోని సాధ్యాసాధ్యాలు ఏమిటి?

వీటిని స్పష్టమైన ప్రతిపాదనలు, వివరాలతో వర్గీకరించి చెప్పాలి.

ఈ ప్రతిపాదనలపై నిపుణులు, ఆయా రంగాల్లో నిష్ణాతులైన అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించాలి. నిర్దిష్ట ప్రతిపాదనలపై అపోహలను, సలహాలను వినాలి. వాటిని చర్చించి బేరీజు వేసి అవసరమైతే మార్చాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. లేకపోతే ప్రస్తుతమున్న చట్టానికి తూట్లు పొడిచినట్టే, ఇల్లు పీకి పందిరేసినట్టే!

**ప్రభుత్వానికి సూచనలు**

1) ఒకవేళ చట్టాన్ని సవరించవలసి వస్తే చట్టంలో స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్ సంస్థలు, లోకల్ బాడీస్ అని పిలవడం, రాయడం మానాలి. ఇక నుంచి చట్టం ప్రతి వాక్యంలో స్థానిక ప్రభుత్వాలు అని రాయాలి. రాజ్యాంగంలోని 40వ ఆర్టికల్‌లో పేర్కొన్న విధంగా స్థానిక స్వపరిపాలన అని ప్రభుత్వాలు పేర్కొనాలి.

2) మూడు ఎఫ్‌ల సిద్ధాంతాన్ని పాటించాలి.

ఎఫ్ అంటే ఫంక్షన్లు, ఎఫ్ - ఫంక్షనరీలు, ఎఫ్ - ఫండ్స్. విధుల్ని, సిబ్బందిని, నిధులను స్థానిక ప్రభుత్వాలకు కేటాయించాలి.

3) సర్పంచ్‌లపై చర్య తీసుకునే అధికారం కలెక్టర్, మంత్రికే ఉన్నా.. వీటిపై అప్పీలుకు అంబుడ్స్‌మన్ అనే స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

4) రాష్ట్ర బడ్జెట్ ద్వారా తలసరి గ్రాంట్‌లను ఇవ్వాలి.

5) కేంద్రం నుంచి రాష్ట్రాలకు వస్తున్న పన్నుల వాటాలో 50 శాతం వాటాను స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వాలి. జాతీయ స్థాయిలోని ప్రభుత్వం నుంచి 51శాతం ఆదాయవాటా, 67శాతం పన్నుల వాటా రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తుండగా, అందులో వెయ్యికి ఒక్క రూపాయి మాత్రమే స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వటం ప్రజల రోజువారీ జీవితాల్ని దుర్భరం చేస్తోంది. ప్రజలుండే నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోనే రోజువారీ పాలన నిర్ణయాలు జరగాలి తప్ప హైదరాబాద్, అమరావతి, ఢిల్లీల్లో కాదు.

6) స్థానిక ప్రభుత్వాలకు అన్నిచోట్లా ప్రత్యక్ష ఎన్నికలు జరగాలి.

7) స్థానిక ప్రభుత్వాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు సభ్యులుగా (కో ఆప్షన్) ఉండకూడదు.

8) ఎమ్మెల్యే, ఎంపీ రాజ్యం పోవాలి. అసెంబ్లీ, పార్లమెంట్‌లు ప్రజోపకరమైన చట్టాలు చేయడానికే పరిమితం కావాలి.

9) ప్రతీ మూడు వేల జనాభాకు ఒక గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉండేలా చేయాలి.

10) చిన్న పంచాయతీలు మనుగడ కష్టంగా ఉంటుంది. కాబట్టి, పంచాయతీలను క్లస్టర్లుగా చేసి గ్రామ పాలనను మెరుగుపరచాలి.

**ప్రభుత్వం చేపట్టే కొన్ని చర్యలను సమర్థించాలి కూడా!**

- సకాలంలో ఎన్నికలు జరిపే ఆలోచనను సమర్థించాలి.
- ప్రస్తుత పంచాయతీల గడువు జులై 1, 2018తో ముగుస్తుంది. మే, జూన్‌లలో ఎన్నికలు జరిపి కొత్తవారు ఎన్నికయ్యేలా చూడాలి.
- కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇవ్వటం అవసరం.
- రిజర్వేషన్లను రెండుసార్లకు పొడిగించటం
- ఆర్థిక సంఘానికి రూ.2వేల కోట్లు కేటాయింపు
- గ్రామజ్యోతి, మన ఊరు-మన ప్రణాళికకు విలువనివ్వటం

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ముఖ్యం కానీ, ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదు. ప్రస్తుతమున్న ఓట్ అండ్ షౌట్ స్థాయిలోనే మన ప్రజాస్వామ్యం కొనసాగితే ఎన్నేళ్లయినా, ఎంతమంది నేతలు మారినా ప్రజల సమస్యలు తీరవు. ప్రజలకు పాలన గురించి అర్థమవటం, పాలనలో వారు భాగస్వాములు కావటం, తాము కడుతున్న పన్నుల డబ్బుతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయనే స్పృహతో ప్రతి రూపాయీ ఖర్చవుతున్న తీరుని ప్రజలు గమనిస్తుండాలి. ఇందులో స్థానిక ప్రభుత్వాల సాధికారతే పునాది. నిజమైన స్థానిక ప్రభుత్వాలు.. ప్రజాస్వామ్యానికి పాఠశాలలు! అందుకే పంచాయతీ రాజ్ చట్టంపై ప్రభుత్వం భాగస్వాములందరితో చర్చించి మార్పుల్ని సరైన దిశలో చేయాలి. డా॥ జేపీ దిశానిర్దేశంలో సూచనల్ని సమగ్రంగా లోక్‌సత్తా తరపున రూపొందించి కూడా తెలంగాణ ప్రభుత్వానికి అందిస్తాం. ✦

# SRI SAI TAX CONSULTANTS

Income Tax &Sales Tax Practitioner



K. HARI HARA PRASAD, B.Com.,

CHILAKALURIPET - 522 616

Cell:9494801740
















## రాష్ట్ర విభజన హామీల అమలు కోసం...

రాష్ట్ర విభజన హామీల అమలు కోసం కృషిలో భాగంగా పవన్ కళ్యాణ్, జేపీ, ఉండవల్లి అరుణ్ కుమార్ తదితరుల మధ్య హైదరాబాద్‌లో జరిగిన సన్నాహక, అధ్యయన సమావేశాల చిత్రాలివి. విజయవాడలో లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీశెట్టి బాబ్జీ, కల్లూరి బాలసుబ్రహ్మణ్యం, ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్న అఖిలపక్ష సమావేశం చిత్రాన్నీ చూడవచ్చు.

Posting Date 07-03-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on March 1st, 2018

# "Tax payers, starting with cities must **REVOLT &DEMAND** better services & local empowerment. People should collectively demand a role in decision making locally - at ward & mohalla level; & link tax paying with it"

Dr.Jayaprakash Narayan,
Founder, Loksatta






LOK SATTA

॥ SHARE IT WIDELY ॥

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad